ANDHRA JYOTI, VIJAYAWADA. Regd. No. HV 139

★★★★ Telephones : 74212, 74343

ఆంధ్రజ్యోతి

123599

సంపుటి 18 సంచిక 40 | విజయవాడ, ఆగస్టు 9, 1977 మంగళవారం | 6 పేజీలు 30 పైసలు

సిమెంట్‌కు కొత్త ప్రత్యామ్నాయం

అక్రా, ఆగస్టు 8— ఘనా ఇంజనీర్లు ఒక కొత్త రసాయన వస్తువును రూపొందించారు. ఇది రోడ్డు నిర్మాణానికి ఉపయోగపడుతుంది. సిమెంట్‌కు ఇది ఉత్తమ ప్రత్యామ్నాయం కాగలదు. ఈ వస్తువుకు 'కన్‌సాలిడ్-444' అని పేరుపెట్టారు. తక్కువ ఖర్చుతో కూడిన ఇళ్ళ నిర్మాణానికై కొత్తరకం ఇటుక తయారు చేయడానికి దీన్ని వినియోగించవచ్చు.

హక్కుల సాధనకు బ్రిటన్‌లో ఆసియా మహిళల నిర్ణయం

లండన్, ఆగస్టు 8—బ్రిటన్‌లో నివసిస్తున్న ఆసియాదేశాల స్త్రీలు గృహాలను అంటిపెట్టుకుని జీవితాలను నాగించే పద్ధతిని ఒదిలిపెట్టి విద్య, ఉపాధి, సాంఘిక సేవా రంగాలలో తమ హక్కులను సాధించుకొనడానికి పోరాటం సాగించాలని నిర్ణయించుకున్నారు.

ఈ విషయంలో వారికి ఇటీవల బ్రిటిష్ మంత్రి శ్రీమతి షిర్లీ విలియమ్స్ ఆశీస్సులు కూడా లభించాయి. ఇటీవల జరిగిన ఆసియా మహిళల సమావేశంలో శ్రీమతి విలియమ్స్ ప్రసంగిస్తూ ఆసియా మహిళలలో నాయకత్వం ప్రముఖ బాగా వున్నదని ప్రశంసించారు.

హరిజనులపై దాడులు తగ్గినవన్న హోం మంత్రి ప్రకటనపై లోక్‌సభలో తీవ్ర వాదోపవాదాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8—ఈ ఏడాది ద్వితీయార్థంలో దాదాపు ప్రతి రాష్ట్రంలోను హరిజనులపై అత్యాచారాల సంఘటనలు తగ్గాయని హోంమంత్రి శ్రీ చరణ్ సింగ్ నేడు లోక్‌సభలో తెలియజేశారు. ఆయన ఈ విషయం చెబుతున్నపుడు సభలో ఉద్రిక్తతతో కూడిన వాదోపవాదాలు జరిగాయి.

"హరిజనులపై అత్యాచారాల వెల్లువ" గా కాంగ్రెస్ నాయకుడు శ్రీ వై. బి. చవాన్ పేర్కొన్న సంఘటనలలో ముడింటికి సంబంధించిన నివేదికలు తాను సభకు అందజేయగలనని శ్రీ చరణ్‌సింగ్ చెప్పారు.

హరిద్వార్, భోపాల్, గుజరాత్‌లలో జరిగినట్టుగా పేర్కొనబడిన అత్యాచారాల గురించి శ్రీ వై. బి. చవాన్ వివరిస్తూ ఇవి కేవలం వ్యక్తిగతమైన కేసులుకాదన్నారు. హరిజనులపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరుగుతున్నట్టు కన్పిస్తున్నదని, ప్రజాభ్యున్నతి కోసం పరిపాలనచేసే ఏ ప్రభుత్వానికైన ఇది పరీక్షవంటిదని ఆయన అన్నారు.

ఈ దశలో వి. పి. ఐ., కాంగ్రెస్ సభ్యులు తాము ప్రసంగించాలని కోరారు. అపుడు జనతా సభ్యులు పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు.

హోంమంత్రి సమాధానంలో చెప్పగోరే విషయంలో మినహా, శ్రీ చవాన్ ప్రకటనపై ఎట్టి చర్చను అనుమతించ బోనని స్పీకర్ శ్రీ కె. ఎస్. హెగ్డే స్పష్టంగా చెప్పారు.

శ్రీ చవాన్ "దాడుల వెల్లువ"వాదనను శ్రీ చరణ్‌సింగ్ సవాలుచేస్తూ, ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో ఒక్క గౌరవనీయ స్నేహితుడు శ్రీ చవాన్ రాష్ట్రం (మహారాష్ట్ర)లో మినహా అన్ని రాష్ట్రాలలోను హరిజనులపై దాడుల ఘటనలు తగ్గాయని చెప్పారు.

ఈ సమస్యపై సభలో "అల్లరి" ఎందుకు జరగాలో తనకు కారణం కన్పించడం లేదని శ్రీ చరణ్‌సింగ్ అన్నారు.

"ప్రతివారు కోపోద్రిక్తులై వున్నారు" అని మంత్రి వ్యాఖ్యానించారు. "దీనికంతటికీ ఒక సందర్భం వుంది" అని ఆయన తీవ్ర స్వరంతో అన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో సాంఘిక, ఆర్థిక జీవనంపై అదుపువున్నభూస్వాములు హింసాయుతంగా వుండేందుకు ప్రయత్నిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ఈ పరిస్థితి గమనించాలని శ్రీ చవాన్ పేర్కొన్నారు. "ఈ ఘటనల గురించి పరిశీలించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరితే చాలదు. ఈ ఘటనలు జాతీయ జీవనంలో విచారకరమైన దశను సృష్టిస్తున్నాయి. వీటిని మరింత తీవ్రంగా పరిశీలించి, దృఢంగా వ్యవహరించాలి" అని శ్రీచవాన్ పేర్కొన్నారు.

శ్రీ చవాన్ తెలియజేసిన హరిద్వార్, గుజరాత్, భోపాల్ ఘటనల గురించి నివేదికలు కోరగలనని శ్రీ చరణ్‌సింగ్ అంటున్నప్పుడు కొందరు సభ్యులు ఆయనకు అంతరాయం కల్పించడానికి ప్రయత్నించారు.

"దేశంలో భూస్వాములు" వున్నారంటే దానికి కారణం ఎవరని శ్రీ చరణ్ సింగ్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

'బ్రెడ్' కంటె మేలైన చపాతీ

న్యూఢిల్లీ, ఆగస్టు 8— పోషకపదార్థందృష్ట్యా మామూలు "బ్రెడ్" (బ్రెడ్) కంటె మనదేశంలో తయారుచేసే చపాతీలు మేలైనవనిడెన్మార్క్ శాస్త్రవేత్తలు ఇటీవల కనుగొన్నారు.

ఇంతకు ముందు పాశ్చాత్య దేశాలకు చెందిన పోషకపదార్థాల విలువలు, చపాతీలుతయారుచేయడంలో గోధుమలలోని పిండిపదార్థాల విలువ గణనీయంగా తగ్గిపోతుందని అందువల్ల పోషకపదార్థం దృష్ట్యా చపాతీల కంటె బ్రెడ్ భుజించడమే మంచిదని అభిప్రాయపడడం జరిగింది.

డెన్మార్క్ శాస్త్రవేత్తల పరిశోధనల పారంపర్యాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ హెచ్. కె. జైన్‌కు తెలియజేశారు.

చపాతీ తయారీలో నష్టమయ్యే పిండి పదార్థం విలువ కేవలం రెండు శాతం కాగా, బేకింగ్ పద్ధతిలో బ్రెడ్ తయారుచేయడంలో పిండి పదార్థం విలువ అయిదు శాతం నష్టమవుతున్నట్టు కనుగొన్నారు.

ఈ విషయమై ఎలుకలపై ప్రయోగాలు జరుపగా బ్రెడ్ తిన్న వారి కంటె చపాతీలు తినిన ఎలుకలు [illegible] శరీరం

[illegible] రూపమెత్తిన మధ్యప్రదేశ్ మంత్రి

ఇందోర్, ఆగస్టు 8—చేసే పనికి అనురూపమైన వేషభాషలు, నడవడి దాని ప్రభావాన్ని, ఫలితాన్ని మరింతగా చేస్తాయని భావించడం కద్దు. అందుకే నాయకులు ఏ ప్రాంతానికి వెడితే ఆ ప్రాంతపు ప్రజల వేషభాషలను, ఉచ్చారణధోరణిని అనుకరించి వారిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తారు.

అయితే మధ్యప్రదేశ్ సాంఘిక, సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ పవన్‌దివాన్ నిన్న ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి తన వేషధారణతో పాటు పేరును కూడా మార్చుకుని కొత్తరూపమెత్తారు.

ఆయన నిన్న యోగులు ధరించే కాషాయాంబరాలు ధరించి, స్వామి అమృతానందగా తనపేరును మార్చుకొని ఇక్కడ యోగ శాస్త్రాధ్యాపకుల కళాశాలకు ప్రారంభోత్సవం చేశారు.

ఈ ఉత్సవంలో పుష్పహారాలు లేవు. కళాశాలకు భవనాలు కానీ, సాధన సామాగ్రికాని ఏమీలేవు.

యోగశాస్త్రానికి సంబంధించిన వ్యాయామం మిక్కిలి సులభమైందని, దానిని ఎక్కడైనా చేయవచ్చునని యోగకళాశాలను ప్రారంభించిన "హరిఓం యోగ కేంద్రా"నికి చెందిన డాక్టర్ వర్మ పేర్కొన్నారు.

పంజాబు రాష్ట్రంలో 1.4 కోట్ల జనాభాకు 1.07కోట్ల రేషన్‌కార్డులు

అమృతసర్, ఆగస్టు 8— పంజాబులో జనాభా సంఖ్య ఎంత వుందో, రేషన్ కార్డుల సంఖ్య కూడా దాదాపు అంతే వుంది.

ఈ విషయాన్ని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల మంత్రి శ్రీ హర్‌బజన్‌సింగ్ నిన్న విలేకరులకు చెబుతూ పంజాబులో జనభా 1.4 కోట్లయితే రేషన్‌కార్డుల సంఖ్య 1.07 కోట్లు అని తెలిపారు.

దొంగ రేషన్ కార్డులను పట్టుకోవడానికి ప్రభుత్వం త్వరలో ఒక ఉద్యమాన్ని ప్రారంభిస్తుందని ఆయన చెబుతూ, దొంగ రేషన్ కార్డులున్న వారంతా ఒక పక్షంలోగా వాటిని అధికారులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. దొంగ రేషన్ కార్డులను పట్టుకొనేందుకు గట్టి కృషి చేయాలని ఆయన అధికారులను కోరారు.

"విడాకుల సంఖ్యలో అమెరికాది అగ్రస్థానమట;"
"అవును మరి, వాళ్ళకు జీవితాంతం ఓపిగ్గా సాధిస్తూ కూర్చోడం తెలియదు!"

భార్గవకమిషన్‌సాక్షులపై బెదరింపుల దర్యాప్తుకు గూఢచారులు

—కేంద్రానికి తార్కుండే కమిటీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 8— నక్సలైట్లపై అత్యాచారాలకు వ్యతిరేకంగా భార్గవ కమిషన్ ముందు సాక్ష్యం ఇస్తున్న వారిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలుకుబడి ఉపయోగిస్తున్నదని గాని, భయభ్రాంతులు చేస్తున్నదన్న విషయం గాని కనుగొనడానికి కేంద్ర ప్రభుత్వం తన స్వంత గూఢచారి సంస్థను నియమించాలని జస్టిస్ తార్కుండే అధ్యక్షతన గల పౌరహక్కుల కమిటీ కేంద్రాన్ని కోరింది.

కమిటీ ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్‌కి వినతిపత్రం సమర్పిస్తూ, నక్సలైట్లను హింసించి, చంపిన పోలీసు అధికారులు ఉద్యోగాలలో కొనసాగడం వల్ల జస్టిస్ భార్గవ కమిషన్ లక్ష్యానికి ఇబ్బంది కలుగుతున్నదని పేర్కొన్నారు.

నక్సలైట్ల కార్యకలాపాలున్న ప్రాంతాలలో వారిపై అత్యాచారాలకు పాల్పడిన పోలీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించడం ప్రారంభమైందని కమిటీ పేర్కొంది. ఇది వారు సాక్షులను బెదిరించడానికి తోడ్పడుతుంటున్నారు.

ఒక ప్రధానమైన సాక్షికోసం 20 వేల రూపాయల నగదు, ఉద్యోగం లంచంగా ఎరచూపినట్టు ఇద్దరు అధికారులు, వారి సన్నిహితుడు, మాజీ కౌన్సిలర్‌చేసిన ప్రకటనలను కమిటీ విడుదలచేసింది. అయితే వారు లంచాన్ని అంగీకరించలేదని పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో కొనసాగినంతకాలం భార్గవ కమిషన్ నిజాన్ని నేకరించగలదా అని తార్కుండే కమిటీ ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

కమిటీ తరపున శ్రీ అరుణ్‌షౌరీ ప్రధానికి మరొక వివరణ పత్రాన్ని దాలలు చేశారు.

నలుగురు నక్సలైట్లను చెట్లకుకట్టికాల్చి చంపిన సంఘటనను ప్రత్యక్షంగా చూసిన సాక్షి శ్రీ భిజెపతి ఇచ్చిన వివరాలు అందులో వున్నాయి.



నాయకుల మధ్య రాజీ కుదర్చడంలో శ్రీ సి. సుబ్రహ్మణ్యం ప్రముఖ పాత్ర వహించారు—వార్త

హరిజనులపై దౌర్జన్యాలను అరికట్టడానికి పటిష్ఠచర్యలు

—ప్రభుత్వానికి శ్రీ భూపేష్‌గుప్తా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 8— దేశవ్యాప్తంగా హరిజనులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు గైకొనవలసిందిగా నేడు రాజ్యసభలో భారత కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడు శ్రీ భూపేష్ గుప్తా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హరిజనులపై భూస్వాముల దౌర్జన్యతత్వాన్ని విభువుదల చెయ్యాలని కూడా ఆయన కోరారు.

హరిద్వార్ సమీపంలో నిన్న సుప్రీం కోర్టు న్యాయవాది శ్రీ ఆర్. కె. గార్గ్, మరి కొందరు హరిజన నాయకులపై చౌహాన్ భూస్వాములు జరిపిన దౌర్జన్యకాండను ఆయన నేడు సభలో "జీరో అవర్" సమయంలో ప్రస్తావించారు.

రక్తంతో నిండిన హరిజనుల బట్టలను ఆయన సభలో చూపించారు.

ఇద్దరు హరిజనుల భూములను చౌహాన్ భూస్వాములు బలవంతంగా ఆక్రమించుకోగా, వాటిని వారికి తిరిగి ఇచ్చివేయమని అడగడానికై శ్రీ గార్గ్ తదితరులు అక్కడకు వెళ్ళారని, దానిలో శ్రీ గార్గ్,తదితరులను నిర్దాక్షిణ్యంగా లాఠీలతో కొట్టారని శ్రీ భూపేష్‌గుప్తా వివరించారు.

మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమం క్రింద హరిజనులకు ఆ భూములు కేటాయించారని, అయితే, జనతా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారి భూములను చౌహాన్ భూస్వాములు ఆక్రమంగా స్వాధీనం చేసుకున్నారని దానిలోవున్న పంటలను నాశనం చేశారని శ్రీ గుప్తా తెలిపారు.

దానితో హరిజనులు శ్రీ గార్గ్ వద్దకు వెళ్ళి తమ భూములను తిరిగి తమకిప్పించవలసిందిగా కోరారని శ్రీ గుప్తా చెప్పారు. శ్రీ గార్గ్ ఆ ప్రాంతం మాజీ శాసన సభ్యుడు.

కొంతమంది హరిజన నాయకులతో శ్రీ గార్గ్ ఆ గ్రామానికి వెళ్ళారని,దాదాపు మూడు వందల మంది భూస్వాములువారిపై దాడి జరిపి, నిర్దాక్షిణ్యంగా కొట్టారని శ్రీ గుప్తా వెల్లడించారు.

నిన్న భూస్వాముల దాడికి గురయిన హరిజనులు నేటి ఉదయం ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్‌ని కలుసుకున్నారని శ్రీ గుప్తా చెప్పారు. "ఈ విషయమై రాజకీయ, పరిపాలనా స్థాయిలలో హోంమంత్రి శ్రీ చరణ్‌సింగ్, ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ జోక్యం కల్పించుకోవాలని. దేశం వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్న భూస్వాముల దౌర్జన్యకాండను అరికట్టాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని శ్రీ గుప్తా అన్నారు.

దర్యాప్తు సంఘాన్ని నియమించాలని విజ్ఞప్తి

జనతాపార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హరిజనులపై అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని. వాటిపై దర్యాప్తు జరపడానికి ఒక సంఘాన్ని నియమించాలని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ కమలాపతి త్రిపాఠీ నేడు రాజ్యసభలో గట్టిగా కోరారు.

దుర్వ్యయ నిరోధానికి, పరిపాలన వ్యయకర్తవానికి అగ్ర ప్రాధాన్యమివ్వగలమని తమిళనాడు ఆర్థిక మంత్రి శ్రీ కె. మనోహరన్ హామీ ఇచ్చినట్టు మదురై వార్త.

కాంగ్రెసుకు శ్రీ హనుమంతయ్య రాజీనామా

బెంగుళూరు, ఆగస్టు 8— కాంగ్రెసు పార్టీ సభ్యత్వానికి మాజీ కేంద్ర మంత్రి శ్రీ కె. హనుమంతయ్య నేడు రాజీనామా చేశారు.

ఆయన తన నిర్ణయాన్ని నేడు విలేకరుల సమావేశంలో ప్రకటించారు. తన మిత్రులు, శ్రేయోభిలాషులతో చర్చించి ఒక పక్షం రోజులలో తమ భావి కార్యక్రమాన్ని నిర్ణయించగలమని ఆయన పేర్కొన్నారు.

ఒక ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ రాజ్‌నారాయణ్ నిన్న తమను కలుసుకుని జనతా పార్టీలో చేరవలసిందిగా కోరారని శ్రీ హనుమంతయ్య అన్నారు. ప్రత్యేకంగా ఒకపార్టీని ప్రారంభించాలని కొందరు సూచిస్తున్నట్టు మాజీ మైసూరు రాష్ట్ర ముఖ్యమంత్రిహనుమంతయ్య అన్నారు.

కాంగ్రెసును విడనాడాలన్న నిర్ణయం చేయడంలో యిప్పటికే తాము చాలా ఆలస్యం చేశామని చాలా మంది అంటున్నారని ఆయన పేర్కొన్నారు. 40 సంవత్సరాలుగా తాము కాంగ్రెసుకు సేవ చేశామని, ఆ పార్టీపై అభిమానాన్ని తొలగించుకొనడానికి ఎంతో శ్రమ పడవలసివచ్చిందని ఆయన వివరించారు.

కాంగ్రెసు పార్టీ సభ్యత్వానికి ఎందుకు రాజీనామా చేయవలసివచ్చిందో శ్రీ హనుమంతయ్య వివరిస్తూ ఇటీవలి సంవత్సరాలలో కాంగ్రెసు పార్టీ బాగా దిగజారిపోయిందని. ప్రజలు తిరస్కరించారని, అన్నారు. ఘోరంగా పరాజయం పొందిన తరువాత కూడా కాంగ్రెసు పార్టీ ఇంకా నైతికంగా దిగజారిపోతున్నదని ఆయన విమర్శించారు.

కర్ణాటకలో 25 మంది మంత్రులు వుండడం సక్రమ ప్రభుత్వం. సమర్థవంత పరిపాలన విషయంలో కాంగ్రెసు పార్టీకి ఎంత చిన్నచూపు వున్నదో స్పష్టంగా సూచిస్తున్నదని శ్రీ హనుమంతయ్య విమర్శించారు.

కాంగ్రెసు పార్టీలో తామొక ప్రేక్షకుడిగానే మిగిలిపోయినట్టు ఆయన అన్నారు. కాంగ్రెసులో అవినీతి, కులాల ప్రమేయాల పట్ల తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్టు, తాము మానసిక శాంతికి దూరమైనట్టు ఆయన చెబుతూ ఈ కారణాల చేత పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు శ్రీ హనుమంతయ్య వివరించారు.

వచ్చే రబీపంటకాలంలో పప్పుధాన్యాల అధికోత్పత్తికి ఉద్యమం:

కేంద్ర వ్యవసాయ మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 8—దేశంలో పప్పుధాన్యాల అధికోత్పత్తికి వచ్చే రబీ పంటకాలంలో ఒక ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ సూర్జీత్‌సింగ్ బర్నాలా నేడిక్కడ ప్రకటించారు.

దేశంలో పప్పు ధాన్యాలు వాడకానికి తగినంతగా లభ్యం కావటంలేదని, వర్షం బాగా కురిసే ప్రాంతంలోనూ, నీటి పారుదల సరిగాలేని ప్రాంతాలలోనూ, పుష్కలంగా వున్న ప్రాంతాలలోనూ పప్పుధాన్యాల ఉత్పత్తిని బాగా పెంచడానికై భారత వ్యవసాయ పరిశోధనా మండలి, కేంద్రవ్యవసాయశాఖ కలిసి ఒకవ్యూహాన్ని తయారు చేస్తున్నాయని వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్-చాన్సలర్‌ల సమావేశానికి ప్రారంభోత్సవం చేస్తూ శ్రీ బర్నాలా పేర్కొన్నారు.

వ్యవసాయదారులకు, కార్యకర్తలకు సహాయం చేయటానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు సంచార శిక్షిణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కూడా కేంద్రమంత్రి కోరారు.

వచ్చే రబీపంటకాలంలో ఉలవలు, బఠాణీలు వంటి పప్పుధాన్యాల అధికోత్పత్తికి గట్టి కృషి జరగాలని శ్రీ బర్నాలాకోరారు. శ్రామికులకు అవసరమయిన కొవ్వు పదార్థాలు, నూనె పదార్థాలు గల ధాన్యాలను ఎక్కువగా ఉత్పత్తి చేయడానికి ఎక్కువ శ్రద్ధ కనబరచాలని కోరారు.

వ్యవసాయరంగం కొత్త పద్ధతులను అలవర్చుకుని, కొత్తగా కల్పింపబడిన సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకొని అధికోత్పత్తికి కృషిజరపాలని ఆయన కోరారు.

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టరు బర్తరఫ్

రాష్ట్ర గవర్నరు ఉత్తర్వు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8—రాష్ట్ర గవర్నర్ శ్రీమతి శారదాముఖర్జీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో సంప్రదించిన పిమ్మట గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన మాజీ వైద్య శాఖాధికారి డాక్టరు సి. రాధాకృష్ణారెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించారు. డాక్టరు రెడ్డికి ఒక క్రిమినల్ కేసులో శిక్షపడింది.

క్రిమినల్ ఆరోపణపై శిక్షకు దారితీసిన డాక్టరు రెడ్డి ప్రవర్తన, ఆయన సర్వీస్ కమిషన్‌లో పుంచడం వాంఛనీయంకాదన్న అభిప్రాయాన్ని తలగజేస్తుందని శ్రీమతి ముఖర్జీ తొలగింపుత్తర్వులో పేర్కొన్నారు.

మైసూరు సంస్థ ఫార్ములేషన్ ద్వారా శీతల పానీయాల ఉత్పత్తి

కోకా-కోలా వ్యవహారం దృష్ట్యా మంత్రి సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 8— పానీయాల తయారీకి అవసరమయిన మౌలిక (ఫార్ములా)ను మైసూర్‌లోని కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ రూపొందించిందని, త్వరలోనేఅది వాణిజ్య వినియోగానికి లభ్యమవుతుందని నేడు లోక్‌సభలో పరిశ్రమలశాఖమంత్రి శ్రీజార్జి ఫెర్నాండెజ్ వెల్లడించారు.

ఈ సదవకాశాన్ని శీతల పానీయాలు ఉత్పత్తిచేసే సంస్థలు సద్వినియోగపరచగలవని తాను నమ్ముతున్నట్టు శ్రీ ఫెర్నాండెజ్ చెప్పారు.

కోకా-కోలా కంపెనీ ప్రస్తుత పరిస్థితిపై మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు శ్రీ జ్యోతిర్మయిబసు ప్రవేశపెట్టిన సావధాన తీర్మానానికి శ్రీ ఫెర్నాండెజ్ జవాబిస్తూ పై విషయం తెలిపారు.

కేంద్ర ఆహార, సాంకేతిక పరిశోధనా సంస్థ రెండు సంవత్సరాలపాటు ప్రయోగాలు జరిపిన అనంతరం రూపొందించిన మౌలికాన్ని ఢిల్లీ నుంచి పూర్వపు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం దాచివేసిన విషయమై మంత్రి పై విధంగా వివరించమని శ్రీ బసు కోరారు.

ఇందుకు దారితీసిన పరిస్థితులపై తాను దర్యాప్తు జరపగలనని శ్రీ ఫెర్నాండెజ్ బదులు చెప్పారు.

తాము ఈ ఫార్ములాను వినియోగించబోమని కోకా-కోలా కంపెనీ యాజమాన్యం వారంటున్నారు. దానితో వివాదం ఏర్పడింది.

కర్ణాటక విశ్వవిద్యాలయం ప్రస్తుత సంవత్సరం నుంచి ఎం.ఫిల్. కోర్సును కొత్తగా ప్రవేశపెట్టనున్నట్టు ధార్వార్ వార్త.

సింధ్‌లో వందమంది భుట్టో మద్దతుదారుల అరెస్టు

కరాచీ, ఆగస్టు 8 — సింధ్ పరగణాలోని సంఘార్‌వద్ద పోలీసులు వందమందిని అరెస్టు చేసినట్టు. వీరిలో ఎక్కువమంది పదవీ చ్యుతుడైన ప్రధాని భుట్టో మద్దతుదారులని పాకిస్తాన్‌కు చెందిన అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది.

రాజకీయ హింసా చర్యలను అణచివేసి, దేశ సమగ్రతకు భద్రతకు భంగం కల్గించే అభిప్రాయాలను వ్యక్తం చేయడాన్ని నిషేధించే లక్ష్యం గల నిబంధనలను జనరల్ జియావుల్ హక్ నాయకత్వంలో గల సైనిక ప్రభుత్వం అచ్చితంగా అమలుజరుపుతున్నట్టు అధికార ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ నిబంధనల క్రింద అరెస్టయినవారు ఏడేళ్ళ జైలు శిక్ష అనుభవించవలసి వుంటుంది.

నిషేధం విధించిన కారణంగా బెలూచిస్తాన్‌లో 1600 సబ్ మెషిన్‌గన్‌లు, రైఫిళ్ళు, పిరంగులను ప్రజలు పోలీస్ స్టేషన్‌లో అప్పగించివేశారని వార్తా సంస్థ తెలియజేసింది.

అరెస్టయిన ఈ కార్యకర్తలు రక్షణ నిబంధనలను ఉల్లంఘించినట్టు,అలజడులు రేకెత్తిస్తున్నట్టు అధికారులు ఆరోపించారని తెలిసింది.

భుట్టో ఎన్నికల ప్రచారం

కరాచీ, ఆగస్టు 8— భుట్టో ఎన్నికల ప్రచారం నిమిత్తం నిన్న ఇక్కడి నుంచి లాహోర్ విమానంలో వెళ్ళారు. భుట్టో రైలులో ప్రయాణం చేయరాదని సైనిక పాలకులు ఆదేశించారు.

ఈ నెల 18న జరగనున్న ఎన్నికలలో పాల్గొనడమా లేదా అనే విషయంపై పీపుల్స్ పార్టీ కార్యకర్తలతో చర్చలు జరిపి, నిర్ణయం గైకొనే నిమిత్తం భుట్టో మొన్న రాత్రి కరాచీ నుంచి లాహోర్ వెళ్ళవలసి వుంది. తనను రైలులో ప్రయాణం చేయవలదని సైనికాధికారులు ఆదేశించినట్టు భుట్టో తన నివాసం ఎదుట చేరిన తన మద్దతుదారులకు చెప్పారు.

రైల్వే ప్రయాణం భద్రతా సమస్యలను సృష్టించగలదని అందుచేత రాజకీయ నాయకులు విమానాలలో పర్యటించడం మంచిదని సలహా ఇచ్చినట్టు సైనిక ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

తాజా వార్త

న్యూఢిల్లీ, ఆగస్టు 8— కాంగ్రెసులో వ్యక్తి పూజను పార్టీ అధ్యక్షుడు శ్రీ బ్రహ్మానందరెడ్డి, లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీ చవాన్ నిశితంగా విమర్శించారు.

ఐతిహాసిక ప్రాధాన్యంకల 'కిన్నర కైలాస' గిరి శిఖరాలు

సిమ్లా, ఆగస్టు 8— కిన్నర కైలాస్ శిఖర సముదాయం తన మనోజ్ఞ సౌందర్య శోభతో ఎన్నో శతాబ్దాలుగా ఆ ప్రాంతానికి వచ్చేవారిని ఆలరిస్తున్నది. హిమాచల ప్రదేశ్‌లోని కిన్నౌర్ జిల్లాలో వున్న ఈ ప్రాంతంలో అరుకు పైగా శిఖరాలు వున్నాయి.

ఇక్కడ నివసించే ప్రజలు మహాభారత కాలానికి చెందిన కిన్నరులు. గంధర్వుల సంతతివారని విశ్వసించడంకద్దు.వీరుకిన్నర కైలాస్ శిఖరాలను, వాటిలోను శివలింగ శిఖరాన్ని ఎంతో అపురూపంగా, పవిత్రమైనవిగా భావిస్తారు.

కడచిన నెలలో రెండు పర్వతారోహక బృందాలు శివలింగ శిఖరాన్ని అధిరోహించాయి. వాటిలో ఒకదానికి దయాల్‌సింగ్ అనే ఉపాధ్యాయుడు నాయకత్వం వహించగా. మరొకదానికి మేజర్స్ట్రిట్‌కోర్డ్లో రీధర్‌గా పనిచేస్తున్న కృష్ణచంద్ కయిద్ నాయకత్వం వహించారు.

శివలింగ శిఖరం ఎత్తు 5480.4 మీటర్లు. ఈశిఖరంలో శివలింగాన్నిపోలినశిలదాదాపు 70 అడుగుల ఎత్తుగా వున్నదని. మధ్యలో అక్కడక్కడ చీలి వున్నదని దయాల్‌సింగ్ తెలియజేశారు. ఈ శివలింగ శిల రోజంతా వివిధ వర్ణాలతో కనిపిస్తుంది. శిలలోకొంత భాగం నల్లగా, కొంత ఎర్రగా, మరి కొంత పసుపుపచ్చగా వుండడమే ఇందుకు కారణమని ఈ బృందాలకు మార్గదర్శకత్వం వహించిన మెహర్‌చంద్ అనే గొర్రెల కాపరి పేర్కొన్నారు. సూర్యకాంతి కూడా యిందుకు దోహదంచేస్తుంది.

కిన్నర కైలాస్ శిఖరాలు శివపార్వతుల ఆవాసభూమి అని, అందువల్ల ఇవి ఎంతో పవిత్రమైనవని ఒకకథ ప్రచారంలో వుంది. ఈ శిఖరాలలో ఒకచోట సంగీతం వినిపిస్తుందని స్థానికులైన ప్రజలు చెబుతారు.

కిన్నరకైలాస్ శిఖరాల చుట్టూ ఏడాది కొకసారి ప్రదక్షిణ కావించడం పవిత్రమైన చర్యగా పరిగణిస్తారు. లామాలు, సాధువులు, సన్యాసులు ఈ ప్రదక్షిణను ఎట్టి పరిస్థితిలోనూ విస్మరించరు.

శివలింగానికి రెండు కిలో మీటర్ల కింద కొంత భాగం మంచుతో, మరికొంతమేర రాళ్ళతో కప్పబడిన సరస్సు వున్నదని,ఈ సరస్సులో ఒకచోట కొవ్వువత్తులను పోలిన 17 ఆకారాలు కనిపిస్తాయని, ఇవి అన్నీ సమానదూరంలో వున్నట్టు కనిపించాయని కృష్ణచంద్ కయిద్ చెప్పారు. సరస్సుకు మరొక ప్రక్క మూడు ఇనుక తిన్నెలు సమానమైన దూరంలో ఎవరో అక్కడ ఏర్పి కూర్చిన్నట్టు వున్నాయని ఆయన అన్నారు. ఈ తిన్నెల చుట్టూ గుంకరాళ్ళు ఎవరో పేర్చినట్టు కనిపిస్తాయి.

ఈ శిఖరాలు తదితర హిమాలయ శిఖరాలంత ఎత్తయినవి కాకున్నా ఎంతో ప్రమాదభరితమైనవి.

కేరళలో ఇరవై మంది నక్సలైట్ ఖైదీల విడుదల

తిరువనంతపురం, ఆగస్టు 8 — కేరళలోని మొత్తం 62 మంది నక్సలైట్ ఖైదీలలో ఇరవై మంది విడుదలైనట్టు హోంమంత్రి శ్రీ కె.ఎం. మణి నేడు ప్రకటించారు.

మిగిలిన వారి కేసుల మంచిచెడ్డలను పరిశీలిస్తున్నట్టు ఆయన అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ వర్తక మహాసభ, ఏలూరు

ఆహ్వానము

ది. 11-8-1977 గురువారం సాయంత్రం ఏలూరులో మర్చంట్ ఛాంబరు వారి శ్రీ సీతారామ భర్తియా కళ్యాణ మండపం-కమ్ ఆడిటోరియం ప్రారంభోత్సవమున్నూ. ది. 12-8-77 శుక్రవారం ఉదయం గం 9-00 లకు ఆడిటోరియంలో శ్రీ కె. రోశయ్య, ఎం.ఎల్.సి. గారి అధ్యక్షతను, హైదరాబాద్‌లోని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్

ఆంధ్రజ్యోతి
"తమసోమా జ్యోతిర్గమయ"

చైనా ఆరోపణ

ఇండియాలో ప్రభుత్వం మారింది. కాంగ్రెసు స్థానంలో జనతా పార్టీ అధికారానికి వచ్చింది.

చైనాలో అంతకుముందే ప్రభుత్వం మారింది. చైర్మన్ మావో మృతి తర్వాత చైర్మన్ హువా అధికారానికి వచ్చాడు. ఇంతేకాదు. అంతకు ముందు అతి తీవ్ర వాదాన్ని అవలంబించిన వర్గం పలుకుబడిని కోల్పోయి "మోడరేట్" విధానాలను అనుసరించే వర్గానిది పైచెయ్యి అయింది. పైగా ఇటీవలివరకు అవమానాలపాలైన తెంగ్ సియావో పింగ్ తిరిగి ఉపప్రధాని పదవిలోకి వచ్చాడు. ఇతడు కీర్తిశేషుడు చౌ ఎన్‌లై శిష్యుడు.

ఏ దేశంలోనైనా కొత్త ప్రభుత్వం అధికారానికి వచ్చినప్పుడు, పాత వైఖరులను మార్చుకొనడానికి, లేదా సడలించడానికి ఆ మార్పును ఒక అవకాశంగా తీసుకోవడం జరుగుతుంది. పదిహేనేళ్ళకుపైగా చైనా ఇండియాపట్ల ఒక విధమైన శత్రుభావాన్ని అవలంబించింది. మావో మృతి తర్వాతనైనా ఈ శత్రుభావాన్ని విడనాడి మనం ఇన్నేళ్ళుగా చాచివుంచిన మైత్రీ హస్తాన్ని అందుకుంటుందేమో, ఉభయ దేశాల సంబంధాలలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించడానికి ఈ అవకాశాన్ని నూతన పాలకులు వినియోగించుకుంటారేమోనని ఆశించడం జరిగింది. క్రిందటేడు ఈ రోజులలో ఉభయ దేశాల మధ్య రాయబారుల స్థాయిలో దౌత్య సంబంధాలు—అనేక సంవత్సరాల విఘాతం తర్వాత—పునఃప్రారంభం కావడం ఈ మార్పుకు నాందీ ప్రస్తావన కాగలదేమోనన్న ఆశాభావం కూడా అప్పటిలో కలిగింది.

కాని. అదంతా వట్టి ఆశాభావంగానే మిగిలిపోవడం విచారకరం. ఉభయ దేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణ నాందీప్రస్తావన దశలోనే వుండిపోయింది. ఇండియాపట్ల చైనా వైఖరిలో పెద్ద మార్పు ఏమీ రాలేదు. పూర్వంవలెనే అప్పుడొక చిరునవ్వు, అక్కడొక కరస్పర్శ తప్ప సాంస్కృతిక రంగంలోగాని, వాణిజ్య, రాజకీయాది ఇతర రంగాలలో గాని రెండు దేశాల మధ్య ఏర్పడవలసిన సహాయ, సహకారాలు ఏర్పడనేలేదు. చైనా మనకు ఎడముఖం, పెడముఖంగానే వుంటున్నది.

నిజానికి మన భూభాగం కొంత ఇప్పటికి కూడా చైనా దురాక్రమణ క్రిందనే వున్నది. అయినప్పటికీ మనం చైనాతో సఖ్యతనే కోరుతున్నాము. అయితే, రెండు చేతులు కలిస్తేగాని చప్పట్లు చరవలేనట్టు, సఖ్యతా కృషి ఫలించడానికి రెండు పక్షాల నుంచి సమానంగా సుముఖత వ్యక్తం కావాలి. కనుకనే, మనం చేయగలిగింది మనం చేశామని, ఇక ముందుకు రావలసింది, చొరవ చేయవలసింది చైనాయేనని విదేశాంగ మంత్రి శ్రీ ఎ. బి. వాజ్‌పాయ్ ఇటీవల లోక్‌సభలో ఉద్ఘాటించారు.

విచిత్రం ఏమిటంటే, ఒకవంక మనం మైత్రీభావాన్ని పునః ప్రకటిస్తుండగా, చైనా అదే సమయంలో ఇండియాపై ఒక అసత్యారోపణ చేసింది. ఇండియాలోని టిబెటన్ శరణార్థులను, వారి నాయకుడైన దలైలామాను సమర్థించడం ద్వారా చైనా వ్యతిరేక కార్యకలాపాలను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదట.

ఈ ఆరోపణకు ప్రేరేపణ ఒక్కటే. దలైలామా క్రిందటి నెలలో దక్షిణ భారతంలోని టిబెటన్ శరణార్థుల శిబిరాలను సందర్శించడానికిగాను వెడుతూ ఢిల్లీ వచ్చారు. ఆ సందర్భంలో మర్యాద కోసం భారత ప్రధాని శ్రీ దేశాయిని, తాత్కాలిక రాష్ట్రపతి శ్రీ జట్టిని, రక్షణ మంత్రి శ్రీ జగ్జీవన్ రామ్‌ను కలుసుకున్నారు. ఇంత మాత్రానికే దీనికి తన వ్యతిరేక చర్యలను ప్రోత్సహించడంగా చైనా ప్రభుత్వం అర్థం చెబుతున్నది. ఇది మంచి పని కాదు సుమా అని ఇండియాను హెచ్చరిస్తున్నది.

దీన్ని బట్టి ఇండియాను అదను దొరికినప్పుడు, దొరకనప్పుడు ఏదోవిధంగా బెదరించడం, హెచ్చరించడం పనిగా పెట్టుకున్న చైనా వైఖరిలో ఎట్టి మార్పు రాలేదనే అనుకోవాలి. మనతో సఖ్యతను అది కోరడం లేదని కూడా అనుకోవాలి. చైనా ప్రదర్శిస్తున్న ఈ వైమనస్యానికి కారణం తనకు బద్ధశత్రువైన సోవియెట్ యూనియన్‌తో ఇండియా యథాప్రకారంగా మైత్రిని కొనసాగించడమే కావచ్చు. లేదా, మరొకటి కావచ్చు. కాని, చైనాతో సఖ్యత కోసమని మన విదేశాంగ విధానాన్ని గాని, మన దేశంలో ఆశ్రయం పొందిన టిబెటన్ శరణార్థులపట్ల మన సానుభూతిని గాని మనం మార్చుకోవలసిన అవసరం లేదు. చైనా అమిత్ర వైఖరికి అనుగుణంగానే మనం అప్రమత్తతను వహించవలసి వుంటుంది.

ఇథియోపియాతో పోరాటంలో 38 మంది సోమాలిసైనికులమృతి

నైరోబి. ఆగస్టు 8—రాజధాని అడ్డిస్ అబాబాకు 240 కిలో మీటర్ల దూరంలో గల ఒక పట్టణంలో సోమాలి చొరబాటుదార్లపై తమ సైన్యాలు దాడిచేసి తరిమివేసినట్టు ఇథియోపియా విన్న ప్రకటించింది.

బాలే పరగణాలోని పర్వతాలలో గల అడాబా పట్టణంలో గురు, శుక్రవారాలలో ఇథియోపియా సైన్యం జరిపిన దాడులలో 38 మంది సోమాలి సైనికులు చనిపోయినట్టు ఇథియోపియా వార్తా సంస్థకు ఇక్కడ అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తున్నది.

అడాబా పట్టణానికి సమీపంలో రోడ్‌పై ఈ వారాంతంలో యుద్ధం జరిగినట్టు ఇథియోపియా తెలిపింది. రెండు వారాల క్రితం వివాదాస్పదమైన ఒగడెన్ ఎడారిలో సరిహద్దు యుద్ధం ప్రారంభమైనది. మొదలు రాజధానికి ఇంత సమీపంలో దాడులు జరగడం ఇదే మొదలు.

మద్రాసు నగరంలో శనివారంనాడు రెండు చోట్ల జరిగిన రోడ్డుప్రమాదాలలో ఇద్దరు బాలురు మరణించారు.

బొప్పాయితోటల పెంపకానికి సూచనలు

తక్కువ కాలంలో ఎక్కువ పండు దిగుబడి నిచ్చి గిరిగీసి పెంచే వార్షికపు పండ్ల జాతులలో బొప్పాయి ముఖ్యమైనది. ఇది ఆరోగ్యానికి ప్రధానంగా కావలసిన లవణాలు, విటమినులు కలిగి త్వరితంగా జీర్ణమై, జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. సుపోషకాహారం ఇవ్వగలదు. సంవత్సరం పొడవునా మన రాష్ట్రంలో ఈ పండ్లు పండించవచ్చు.

బొప్పాయి పండించడానికి సారవంతమైన గరప నేలలు శ్రేష్ఠం. ఒండ్రునేలలు. నల్లనేలలలో బాగా మురుగుపోయే వసతి గల ప్రదేశాలలో పండించవచ్చు. అధిక వర్షం పడే ప్రాంతాలలో త్వరితంగా మురుగుపోయే ప్రాంతాలను ఎన్నుకోవాలి. ఇది కొంతవరకు నీటి ఎద్దడిని తట్టుకొంటుందిగాని, నీటి ముంపును తట్టుకోలేదు. బొప్పాయిలో మూడురకాల చెట్లు గలవు. 1. మగ పూవులుగల చెట్లు, 2. ఆడపూవులుగల చెట్లు 3. ఆడ-మగ పూవులుగల చెట్లు. మగచెట్లు కాపు కాయవు మిగతా రెండురకాలు కాయలుకాస్తాయి. ఆడచెట్లు కాయడానికి వరాగ సంపర్కం అవసరం. కావున ప్రతి నూరు ఆడచెట్లకు నూరు మగచెట్లు అవసరం.

మన రాష్ట్రంలో పండించదగు రకాలు

1. కూర్గు హనీడ్యూ : ఈ రకం "హనీడ్యూ" నుంచి ఎన్నిక చేయబడినది. దీన్ని "మదుబిందు" అని కూడా అంటారు. పండ్లలో విత్తనం చాలా తక్కువ. చెట్టు పొట్టిగా వుంటుంది. పండ్లు పొడవుగా వుండి, ఎక్కువ కండ కలిగి, మంచి సువాసన కలిగివుంటుంది. తీపి కొంచెం తక్కువ. ఎక్కువ కాపు కాస్తుంది.

2. కోయంబత్తూరు I: చెట్టు పొట్టిగా వుండి ఎక్కువ కాపు కాస్తుంది. పండ్లు చాలా రుచిగా వుంటాయి. పండ్లన్నీ ఒకే పరిమాణం కలిగి వుంటాయి. పండ్లు కోయడం సులభం.

3. వాషింగటన్ : ఈ రకం చెట్టు కణుపులు, ఆకు, కాడ ఎరుపు మిశ్రితమైన పూడా రంగులో వుంటాయి. పండ్లు గుండ్రంగా చివరను మొన కలిగి వుంటాయి. ఒకొక్క పండు సుమారు 2-3 కిలో గ్రాముల బరువు వుంటాయి. బాగా తయారైన పండు మంచి వాసువు వర్ణం కలిగివుంటాయి. కండ కూడా వాసువు వర్ణంలో ఆకర్షణీయంగా వుంటుంది. మంచి సువాసన కలిగి పండ్లు తియ్యగా వుంటాయి. చెట్లు పొడవుగా ఎదుగుతాయి.

నారు పెంచడం: పండ్లనుంచి తాజాగా తీసిన విత్తనాలు నారుపోయాలి. విత్తనం నిలువవున్నచో మొలకెత్తంచి బాగా తగ్గిపోతుంది. నారుమడి అరు అడుగులు పొడవు, మూడు అడుగులు వెడల్పు, 6-9 అంగుళాలు ఎత్తు వుండేట్టు తయారు చేయాలి. ప్రతి నారుమడిని బాగా కదిలగొట్టి మట్టిని మెత్తగా వుండేట్టు తయారుచేసి ప్రతి మడికి రెండుతట్టాలు బాగా చివికిన పెంట ఎరువు గాని, కంపోస్టుగాని, ఒక తట్ట ఒండ్రుమట్టి వేసి బాగా కలపాలి. బాగా తయారుచేసిన నారుమడిలో వరుసలలో విత్తనం అరఅంగుళం లోతులో నాటాలి. విత్తనానికి, విత్తనానికి అంగుళం ఎడం వుంచి,

పాడి పంటలు

వరుసకు-వరుసకు ఆరుఅంగుళాల దూరంవుండాలి. ఎకరం నేలకు సరిపడ నారు పెంచడానికి 5-7 పౌన్సుల విత్తనం కావాలి. విత్తనం నాటినవెంటనే "రోజుకేన్"తో నారుమడిని తడపాలి. ప్రతిరోజు నారుమడికి "రోజుకేన్"తో నీరుపోయాలి. నారుమడిలో ఎక్కువ నేమివుంటే మాగుడుతెగులువచ్చి మొక్కలు చనిపోతాయి. తెగులు రాకుండా నివారించడానికి "బోర్డో మిశ్రమం" గాని, రాగి రాతివుగల శిలీంధ్ర మందులుగాని పిచికారి చేయాలి. విత్తనం మొలకెత్తడానికి సుమారు మూడువారాలు పడుతుంది. మొక్క తొమ్మిది అంగుళాల ఎత్తు పెరిగిన తరువాత నారుమడినుంచి తీసి నాటడానికి వినియోగించాలి.

మొక్కలు నాటడం: నారు తీయడానికి 15 రోజుల ముందుగా మొక్కలు నాటవలసిన చేలో 18 అంగుళాల పొడవు, 18 అంగుళాల వెడల్పు, 18 అంగుళాల లోతుగల గోతులను వరుసలో ఎనిమిది అడుగుల దూరంలోను, వరుసకు వరుసకు 8 అడుగుల దూరం వుండేట్టు త్రవ్వాలి. ప్రతి గుండ నుంచి త్రవ్వితీసిన మెత్తని మట్టితో ఒకతట్ట (12 కిలోగ్రాములు) బాగా చివికిన ఎరువుల పెంటగాని, కంపోస్టుగాని కలిపి గోతులు నింపాలి ఒక్కొక్క గుండలో రెండు మొక్కలు నాటాలి. మొక్కలను సాయంత్రం వేళలో నాటి వెంటనే నీరు పోయాలి. మొక్కలు నాటడానికి జూన్ నెల నుంచి నవంబర్ నెల వరకు అనువైన కాలం. మొక్కలు నాటిన దగ్గర నుంచి వాన కురిసినపుడు నేల ఉడిగా వున్నప్పుడు తప్ప మిగిలిన సమయాలలో నాలుగు రోజులకు ఒకసారి చిన్నమొక్కలకు నీరుపెట్టాలి. రోజు ఎదుగుదలకు ఎక్కువ కాపు పట్టడానికి నీరు కట్టడంలో చాలా శ్రద్ధ అవసరం. వాతావరణాన్ని బట్టి, నేల భౌతిక పరిస్థితిని బట్టి 8-10 దినాల కొకసారి నీరు పెట్టాలి. వర్షాకాలంలో నీరు పెట్టనవసరం వుండదు. మురుగు నీరు నిలువ వుండకుండా వెంటనే పైకి పోవునట్టు చూడాలి.

తొలకరిలోను, శీతాకాలంలోను మొక్కలమధ్య రెండు మూడు సార్లు దున్నాలి మొక్క చుట్టూతా పాదులో ఎప్పటికప్పుడు గొప్ప త్రవ్వి కలుపు మొక్కలు పుట్టకుండా చూడాలి. వర్షాకాలం మొక్క మొదట నీరు చేరకుండా మొక్క చుట్టూ మట్టి దిమ్మవేయాలి. జులై నెలలో వరుసల మధ్య జనుము విత్తనం చల్లి సెప్టెంబర్—అక్టోబర్ నెలలలో జనుమును పెరుగుస్న భూమిలో కలిసేట్టు చేయడంవల్ల మొక్కలకు కావలసిన సారవంతమైన సేంద్రియ పదార్థం అందుబాటులో వుంటుంది. మొక్కలు ఏపుగా పెరిగి ఎక్కువ ఫలసాయం ఇస్తాయి.

ఎరువులు వేయడం : మొక్క నాటిన నాలుగు నెలల తరువాతను, 12 నెలల తరువాతను ప్రతి మొక్కకు రెండు తట్టలు బాగా చివికిన పశువుల పెంటగాని, కంపోస్టు ఎరువుగాని వేయాలి. ఎరువుల ఎరువుతో పాటు ప్రతి మొక్కకు 500 గ్రాములు (అర కేజ) సూపర్ ఫాస్ఫేటు, 200 గ్రాములు అమోనియం సల్ఫేటు, 300 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపివేయాలి. ప్రతి మొక్క మొదలుకు ఆరు అంగుళముల దూరంలో చుట్టూతా పైపైన నేలనుత్రవ్వి ఎరువులమిశ్రమం వేసి మట్టిలో బాగా కలిపేట్టు గొప్ప త్రవ్వాలి. ఎరువు వేసిన వెంటనే నీరుపెట్టాలి.

మొక్కలు నాటిన ఆరునెలలకు పూతపూస్తాయి. దీన్నిబట్టి తొలిలో ప్రతి 100 ఆడమొక్కలకు 10 మగమొక్కలు వుండేట్టుచూసి మిగితా మగ మొక్కలను తీసివేయాలి

—శ్రీ గోనా రామారావు

సహజ సంపద వినియోగంలో శాస్త్రజ్ఞుల తోడ్పాటు: మంత్రి విజ్ఞప్తి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్. ఆగస్టు 8— గరిష్ఠ స్థాయిలో సహజ వనరుల వినియోగానికి, వాటి సమీకరణకు శాస్త్రజ్ఞుల సహకారం అవసరమని వ్యవసాయ మంత్రి శ్రీ జె. చొక్కారావు అన్నారు.

రాష్ట్ర సైన్సు అకాడమీ ఆధ్వర్యాన సహజ వనరులపై రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి సమావేశం ఇక్కడ ముగింపు సందర్భంగా విన్న ఇక్కడ జరిగిన సమావేశంలో శ్రీ చొక్కారావు ప్రసంగించారు.

అమూల్యమయిన వలహాలు, సూచనలు చేయడంలో శాస్త్రజ్ఞులు నిర్మొహమాటంగా, నిర్భయంగా వ్యవహరించాలని మంత్రి కోరారు. వారి సూచనలు ప్రభుత్వం పరిగణించి, నిర్మాణాత్మక చర్యలను గైకొంటుందని ఆయన తెలిపారు.

గ్రామీణ ఆర్థిక సమాజిక పురోగతికై శాస్త్రజ్ఞులు మరింత దీక్షతో కృషి చేయాలని అన్నారు.

సహజ వనరుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న సమావేశ తీర్మానాన్ని వివరించి ఈ కమిషన్ ఏర్పాటుకు శాయశక్తులా కృషిచేస్తానని మంత్రితెలిపారు.

విశ్వవిద్యాలయాల గ్రాంట్ల కమిషన్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బి. రామచంద్రరావు ముగింపు ఉపన్యాసమిస్తూ ఇంతవరకు పారిశ్రామికాభివృద్ధికి గ్రామీణ పరిస్థితులు మెరుగుదలకు శాస్త్ర, సాంకేతికవిజ్ఞానాన్ని వినియోగించాలని అన్నారు.

అధిక భాగం పెట్టుబడి పట్టణ ప్రాంతాలలో వినియోగించబడుతుంటుంది, గ్రామీణ ప్రాంతాలలో సమాన ప్రతిపత్తిలో అభివృద్ధి సాధ్యంకాదని ఆయన తెలిపారు. సహజ వనరుల ఉత్పత్తి వినియోగానికి స్వదేశశాస్త్ర విజ్ఞానంమారినంతగా అభివృద్ధి చెందవలసిందని ఆయనఅభిప్రాయపడ్డారు.

సహజ వనరులలో ఒకటైన నార శక్తిని గరిష్ఠ స్థాయిలో వినియోగించాలని ఆయన సూచించారు.

తొలుత అకాడమీ అధ్యక్షులు ప్రొఫెసర్ రాందాల్ స్వాగతం చెబుతూ సహజ వనరుల కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అమెరికాలోని కేంబ్రిడ్జిలోగల హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన రోగార్ రీవెల్లీ ప్రసంగిస్తూ సహజ వనరులతోపాటు మానవశక్తిని, సారశక్తిని వినియోగిస్తేనే దేశ సౌభాగ్యం చేకూరుతున్నదని అన్నారు. జనిటర్ ఇంజనీరింగ్ అవశ్యకతను గురించి, సహజవనరులు గురించి శ్రీ రీవెల్లీ వివరించారు.

పాఠశాలల స్థాయినుంచి యోగాభ్యాసానికి ఏర్పాట్లు

బెంగుళూరులో శ్రీ రాజ్‌నారాయణ్ సూచన

బెంగుళూరు. ఆగస్టు 8 — భారతీయ సంస్కృతి అధ్యయన అంతర్జాతీయ కేంద్రానికి కేంద్ర ఆరోగ్యమంత్రి శ్రీరాజ్ నారాయణ్ విన్న ఇక్కడ ప్రారంభోత్సవంచేస్తూ, యోగాభ్యాసాన్ని పాఠశాలస్థాయి నుంచి ప్రవేశపెట్టాలని విద్యావేత్తలకు విజ్ఞప్తి చేశారు.

శ్రీ శివబాలయోగి మహారాజ్ ట్రస్ట్ ఐదు లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన ఈ కేంద్రంలో పెద్ద ప్రార్థనా మందిరంవుంది. ఇక్కడ యోగాభ్యాసం నేర్పుతారు. గ్రంథాలయం, డిస్పెన్సరీ కూడా వున్నాయి.

హోమియోపతి, ఆయుర్వేదం, యోగాభ్యాసం, ప్రకృతి చికిత్స వంటి దేశీయ వైద్య విధానాలకు కేంద్రం సముచితస్థానం ఇస్తుందని, ప్రజలలో జాతీయభావం పెంపొందించడానికి సహాయపడుతుందని శ్రీ రాజ్ నారాయణ్ చెప్పారు.

మన తత్వశాస్త్రం, మందులపై ప్రజల ఆలోచనను బ్రిటిష్ పాలన వక్రమార్గం పట్టించిందని శ్రీ రాజ్ నారాయణ్ అన్నారు. ఉన్నతమైన వారసత్వం పట్ల ప్రజలకు విశ్వాసాన్ని పునరుద్ధరించాలని జనతా పార్టీ సంకల్పించినట్టు ఆయన చెప్పారు.

కులాల ప్రాతిపదికగా ప్రజల మధ్య విభజనలువుండనటు వంటి సమాజాన్ని ఏర్పరచడానికి జనతా పార్టీ దీక్షవహించిందని శ్రీ రాజ్ నారాయణ్ ఉద్ఘాటించారు. మన పురాణాలు, బోధనలు వర్గరహిత సమాజాన్నే ప్రచారం చేశాయన్నారు.

మానవ నిర్మితమైన అసమానతలను ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాల నుంచి తొలగింపవచ్చునని ఆయన హర్షధ్వానాల మధ్య అన్నారు.

ప్రజల ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, ఇల్లు అందించడం కోసం జనతా ప్రభుత్వం కృషిచేయగలదన్నారు.

జనతాపార్టి సమైక్యపార్టీఅని, అందులో విభేదాలులేవని శ్రీ రాజ్ నారాయణ్ తెలిపారు. జనతాప్రభుత్వం మీసా చట్టం క్రింద ఎవరినీ అరెస్టు చేయబోదని ఆయన స్పష్టంచేశారు.

దక్షిణాదిన జనతాపార్టీని పటిష్ఠం చేయడంకోసం సభ్యత్వం చేర్పించి, చేసిన వాగ్దానాలను అమలుపరచవలసి వుందని ఆయన అన్నారు.

అస్పృశ్యతను రూపుమాపడం కోసం ప్రజలు కలిసి భోజనాలు చేయాలని, అంతర్వర్ణ వివాహాలు చేసుకోవాలని శ్రీ రాజ్ నారాయణ్ సూచించారు. ఆత్యయిక స్థితి కాలంలో పోల్చితే ఇపుడు ధరలు తగ్గాయన్నారు.

పంజాబ్‌లో పోలీసులు, పైఅధికారులకు ఒకేరకమైన యూనిఫారం

చండీఘర్, ఆగస్టు 8—క్రింది ఉద్యోగులలో న్యూనతాభావాన్ని తొలగించడం కోసం ఈ నెల 15 నుంచి పంజాబ్‌లో పోలీసు కానిస్టేబిల్ మొదలు ఐ. జి. పి. వరకు అందరు ఒకే రకమైన యూనిఫారం ధరిస్తారు.

పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ ప్రకాశ్ సింగ్ బాదల్ విన్న పత్రికా గోష్ఠిలో ఈ విషయాన్ని ప్రకటిస్తూ, పోలీసు శాఖ సిబ్బందిలో వ్యత్యాసం హోదాలకు సంబంధించిన బ్యాడ్జీలలో మాత్రమే వుంటుందని చెప్పారు.

జన వాక్యం

కోనసీమలో ఆర్.టి.సి. సిబ్బంది ఉదాసీనత

కోనసీమలో సామాన్యులకు రవాణా సంస్థ బస్సులు తప్ప మరి ఇతర ప్రయాణ సాధనాలు లేవు.

ప్రజల కోసం తమ సంస్థ అని చిహ్నాన్ని రూపొందించుకొని తిరిగే ఆర్.టి.సి. బస్సులకు చెందిన అధికారులు ప్రయాణీకులను అగౌరవపరచడం, అతి హీనంగా చూడడం జరుగుతున్నది.

రోడ్డు రవాణా సంస్థలో క్రమశిక్షణ లోపించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధికారులు చూసీచూడనట్టు వుంటున్నారు.

సిబ్బంది ప్రయాణీకులను హీనభావంతో చూడడంతోపాటు ప్రయాణీకులు టిక్కెట్టు కొన్నప్పుడు వారికి చిల్లర ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే మర్చిపోయానని కండక్టరు అంటాడు. అదీకాక రద్దీ సమయంలో బస్సులను స్టేజీలవద్ద ఆపక కొంత దూరాన ఆపి ప్రయాణీకులకు ఇబ్బంది కలుగ చేస్తున్నారు.

ఏ ఒక్క బస్సు సకాలంలో రావడం కాని, పోవడంకాని ఉండదు. ఏదైనా ఇబ్బందు కాని, సెలహాకాని వ్రాద్దామనుకొంటే ఆ బస్సులో కండక్టెయింటు పుస్తకం వుండదు.

ఈ విషయాలను ఆర్.టి.సి. అధికారులు గమనించి ఈవిషయంలో అక్కడ ప్రజా ఉద్యమం రాకుండా చూడాలి.

వి. రమేష్‌బాబు.
నగరం-తూర్పుగోదావరి.

జనతాపార్టీకి కమిషన్ల పట్ల ఆసక్తి

జనతాపార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, ఇప్పటి వరకు అవలోకించి చూస్తే, జనతా అధినేతలకు కమిషన్ల మీదవున్నంత ఆసక్తి ఇంక ఏఇతర విషయంమీద లేదని పిస్తోంది.

ఒక ప్రక్కన ధరలు ఆకాశాన్నంటుతుంటే, మరొక ప్రక్క నిరోద్యోగుల సమస్య విలయతాండవం చేస్తూంటేమరొక ప్రక్క ప్రజలు ఆకలిదప్పులతో అలమటిస్తుంటే జనతా నాయకులు ఏం చేస్తున్నారు ?

కమిటీలు, కమిషన్లు వేసినంత మాత్రాన ప్రజలస్థితిగతులు మారుతాయా? ఏ పార్టి అధికారంలోకి వచ్చినా ప్రజల కష్టనిష్టురాలను పట్టించుకొనినంత లేదు.

కాంగ్రెసు పరిపాలనను బట్టబయలు చేసినంత మాత్రాన ప్రజలసమస్యలు ఒక కొలిక్కివస్తాయా ?

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో జనతా పార్టీ గెలవాలంటే తక్షిణం ఆంధ్ర ప్రాంతంలో నెలకొల్పుతామన్న పరిశ్రమలను నెలకొల్పాలి లేదా ఆంధ్ర ప్రజలు ఎన్నికలను బహిష్కరించడానికు వెనుదీయరాదని గుర్తుంచుకోవాలి.

చదలవాడ ప్రతాప్, కంతంనేని ప్రసాద్-ఎట్లవల్లి.

యర్రగొండపాలెం సబ్‌తాలూకాలో క్షామం

యర్రగొండపాలెం సబ్‌తాలూకా క్షామదేవతకు స్థిరనివాసమైనట్టున్నది. బహుకాలంగా సకాలములో వర్షములు లేక అకాలవర్షములైనను తనివిలేక పోవుట చేత పూర్తిగా బావుల ఆధారంతో పైర్లు పండించుకొను ఈ ప్రాంతం విద్యుత్ సరఫరా అయినదాదిగా ఆ కొలది జలాధారంతోనె ప్రజలు పంటలు పండించుకొనుటకు కాలక్షేపం చేయుచున్నారు.

ఈ సంవత్సరము ఇంతవరకు వర్షములు లేవు. కనీసం చేదుబావులలోని నీరు కూడా కొన్ని గ్రామాదులలో ప్రజలకు సరిపడుట లేదు. పంచాయతీ సమితి సబ్ తాలూకా కేంద్రమైన యర్రగొండపాలెంలోనే మంచి నీటి యెద్దడి సంభవించినది. చాలినన్ని పబ్లిక్, ప్రయివేటు బావులున్నను దాదాపు అన్ని చెరువులలో నీరు అడుగంటి బురదలు వచ్చుచున్నవి. సురక్షిత మంచినీటి పథకం నెలకొల్పబడినదిగాని నేటి వరకు విద్యుత్ సరఫరా లేక అదిపనిచేయుట లేదు.

మోటజావులలో నీరు కరెంటు మోటార్లకు అందక కనీసం రోజుకు 1/4 ఎకరము భూమికి కూడా సరిపడక నిల్చియున్న పైరు వాడువట్టినది.

ఈ దుస్థితిని ప్రజానాయకులు గమనించి నట్లులేదు. వారు ప్రజల మధ్యకు ఎలక్షన్లు లేవు కాన ఇప్పట్లో రావలసిన అవసరం లేదు. ఇక విషయములు ప్రభుత్వ దృష్టికి రావనుకొంటా! ప్రభుత్వోద్యోగులు తమ వద్ద నున్న వర్షపాతపు లెక్కలను చూచుకొని గదా! వారు పై హారికి తెలియపర్చవలసినది. అంతవరకు వేచియుండవలసినదేనా?

ప్రభుత్వం ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టనుఖములు విచారించితే వారి సలహాలు, అనుభవపాఠములు గాన శాశ్వత క్షామ నివారణకు పునరరించునుకదా! యిట్టి ప్రయత్నం గ్రామస్థాయిలో ప్రభుత్వం చేయగలదని ఆశించుచున్నాను.

వి. రామలింగం.
యర్రగొండపాలెం.

ఇన్‌స్పెక్టర్ విక్రమ్

రచన : రామ్‌వాయార్కర్



నీతి సూక్తులు

చరిత్ర పునరావృత్తం కావడానికి ఒక కారణం ఏమిటంటే, మొదటి సారి జరిగినప్పుడు ఎవ్వరూ పట్టించుకొనకపోవడం.

—మార్గరెట్ హ్యూసీ.

1977 ఆగస్టు 9 మంగళవారం
శ్రీ పింగళ నామ సంవత్సర నిజఆషాఢ బ॥ దశమి: రా॥ 7-19 రోహిణి: రా॥ 8-13 వర్జ్యం: ఉ॥ 11-21 ను 1-17 వరకు వర్జ్యం: రా॥ 2-27 నుంచి 4-13 వరకు

1977 ఆగస్టు 10 బుధవారం
శ్రీ పింగళ నామ సంవత్సర నిజ ఆషాఢ బ॥ ఏకాదశి: రా॥ 9-19 మృగశిర: రా॥ 10-49 వర్జ్యం: లేదు

చిత్రసీమ

కౌముదీ పిక్చర్స్ భారీ వర్ణచిత్రం "నాయుడు బావ"

కౌముదీ పిక్చర్స్ పతాకం కింద పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత ఎం. ఎస్. రెడ్డి నిర్మిస్తున్న భారీ వర్ణచిత్రం "నాయుడు బావ" షూటింగ్ కార్యక్రమం జులై 31 ఉదయం ప్రసాద్ స్టుడియోస్‌లో ప్రారంభమైంది. ఈ ముహూర్తానికి పరిశ్రమలోని పలువురు ప్రముఖులు, పాత్రధారులు విచ్చేసి నిర్మాతను అభినందించారు. ఎన్. రవీంద్రనాథరెడ్డి కెమెరా స్విచ్ ఆన్

కౌముదీ పిక్చర్స్ "నాయుడుబావ" ప్రారంభోత్సవ దృశ్యం

చేయగా, డాక్టర్ ముద్దు కృష్ణారెడ్డి క్లాప్ చేశారు. శోభన్ బాబు, జయసుధలమీద తొలిషాట్ చిత్రీకరించబడింది.

"పాలూ చక్కెరా కలిశాయి
ఆలూమగలై వెలిశాయి
అనురాగాన్నీ, అనుబంధాన్నీ
మమతలుగా ముడివేశాయి"

అనే ఆ పాటలో కొంత భాగాన్ని ఆ రోజు నాయకా నాయికలమీద దర్శకుడు పి. చంద్రశేఖరరెడ్డి చిత్రీకరించారు. కథలోను, కథనంలోను నవ్యత పుట్టి ఐదేలా రూపొందిన రాజశ్రీ కథకు మాటలనంటి మాటలను, మల్లెలవంటి పాటలను కూర్చి మాలలా తీర్చిదిద్దిన పూనత ముల్లమాలకే దక్కుతుంది. శోభన్ బాబు ఆద్యంతం వైవిధ్యపాత్ర దరిస్తున్న ఈ వర్ణచిత్రంలో జయసుధ, జయప్రద నాయికలుగా నటిస్తున్నారు. సత్యనారాయణ, రాజబాబు, మోహన్‌బాబు, సాక్షిరంగారావు, మమత, నిర్మల, జయమాలిని, విజయలక్ష్మి, సుధ యితర ప్రధాన పాత్రధారులు.

గతంలో మానవుడు-దానవుడు వంటి చిత్రాన్ని అందించిన హీరో శోభన్‌బాబు, దర్శకుడు పి. చంద్రశేఖరరెడ్డిల కలయికలో ఈ చిత్రం కూడా విజయవంతంకాగలదని ఆశించవచ్చు. సత్యం (సంగీతం), పి.యస్.ప్రకాష్ (ఛాయాగ్రహణం), భాస్కరరాజు (కళ), మార్తాండ్ (కూర్పు), ఈశ్వరరెడ్డి (సహదర్శకుడు), కృష్ణమూర్తి (ప్రొడక్షన్) తెరవెనుకకళాకారులు. విజయాపిక్చర్స్ విడుదల.

—మిక్కిలినేని జగదీష్‌బాబు

వార్తల వెనుక విశేషాలు

అంతులేని బెడద

ఏ సమస్య అయినా పరే-ప్రాణం మీదికి వస్తేకాని పట్టించుకొనకపోవడం మన జాతీయ స్వభావంలో ఒక ముఖ్యాంశమేమో!

అగ్నిప్రమాదాలను గురించి చేసంగిలోనే ఆలోచిస్తాము. తరిగి తొలకరి ప్రారంభం కాగానే వాటి సంగతే మరచిపోతాము. "ఇల్లు కాలుతుంటే బావి త్రవ్వినట్టే" మన స్వభావం కంటె అగ్నిప్రమాదాల నివారణకు మానవ శక్తికి అందుబాటులో వున్న జాగ్రత్తలను ముందుగా తీసుకుంటే ఆ ప్ర

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఫారెస్టు డిపార్టుమెంటు

వేలం నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ప్రొద్దుటూరు ఫారెస్టు డివిజనులోని 1977–78వ సంవత్సరపు, పోరుమామిళ్ళ,వనిపెంట, బద్వేలు,ప్రొద్దుటూరు రేంజిలకు చెందిన వెదురు కూపులు (ట్యాంబు కూపులు) 22-8-1977వ తేదీ ఉదయం 11-00 గంటలకు ప్రొద్దుటూరు డివిజన్‌ఫారెస్టుఆఫీసులో డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు లేక వారిచే నియమింపబడినవారి వల్ల బహిరంగముగా వేలముచేయబడును.

వేలము యొక్క షరతులను గూర్చి గాని, వేలము చేయబడు (గుత్తలు)తీరును గూర్చిగాని పూర్తి వివరములు ప్రొద్దుటూరు డివిజన్ ఫారెస్టు ఆఫీసరువల్ల గాని లేక పై రేంజి ఆఫీసర్లవల్ల గాని తెలుసుకొనవచ్చును.

(సం) అన్వర్ హుసేన్,
డివిజనల్ అటవీశాఖాధికారి,
ప్రొద్దుటూరు డివిజన్,
ప్రొద్దుటూరు.

746/Advt/77/4-8-77

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ
అటవీ శాఖ
మార్కాపురం, ప్రకాశం జిల్లా

ప్రకాశంజిల్లా మార్కాపురం అటవీ శాఖ మండలములోని దోర్నాల, ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి మరియు మార్కాపురం రేంజిలకు సంబంధించిన 1977-78 చిల్లర వలసాయముల యిజారాల వేలం శ్రీ మార్కాపురం అటవీమండలాధికారిచేగాని, వారిచే నియమింపబడిన ప్రతినిధిచేగాని మార్కాపురం అటవీమండల కార్యాలయము ఆవరణలో తే 19-8-77 ది ఉదయం గ. 11-00లకు ప్రారంభింపబడును.

వేలము వివరములు వాటి నిబంధనలు మార్కాపురం అటవీ మండలాధికారి గారి నుండి గాని, ఆయా రేంజి అధికారుల నుండి పొందవచ్చును.

కె. శ్రీరాములు,
అటవీ మండలాధికారి,
మార్కాపురం, ప్రకాశంజిల్లా.

760/Advt/77/6.8.77

కృష్ణా పోర్టు ట్రస్టు
టెండరు నోటీసు
ది. 6-8-1977

"ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి డిజెల్ లోకోషెడ్ దక్షిణం వరకు డంపర్ యార్డురైల్వే లైన్ల క్రీగ్రేడింగు" పని కొరకు నిర్ణీత నమూనాలో నీలుచేసిన టెండర్లు ది.18-8-77 తేదీ మ॥ గం. 3-00ల వరకు అనుభవము గల కంట్రాక్టర్ల నుంచి కోరబడుచున్నవి. (ఎస్టిమేటు మొత్తము రు.3,28,976/-).తిరిగి అదేరోజు మ॥గం.3-00ల తర్వాత టెండర్లు తెరువబడును. టెండర్లు 18-8-77 వరకు మాత్రమే కార్యాలయము పనిచేయు గంటలలో జారీచేయబడును. పైన తెలిపిన సమయము లేదీ తర్వాతచేరు టెండర్లు పరిశీలించబడవు. టెండరు డాక్యుమెంట్లు జారీ చేయుటకుగాను ఇటీవలి సాల్వెన్సీ సర్టిఫికెటు, ఇన్‌కంటాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెటు మరియు సంస్థ అయినచో పార్టనరుషిప్ డీడ్ తో పాటుగా పైన తెలియపరచబడిన వివరములు లాంటివి లోగడ చేసినట్లు చూపు ఆధారము దాఖలుచేయాలి.

టెండరు పెట్టి దరఖాస్తు చేసుకున్నవారు రు. 200/-లు (రెండువందల రూపాయలు మాత్రము) ఫైనాన్షియల్ అడ్వయిజర్ & చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు, విశాఖపట్టణం పోర్టుట్రస్టు (అకౌంట్స్ నెం. 385) వారికి చెల్లించి అందుమీదట పొందిన రశీదు టెండరు ఫారముల సప్లయి కొరకు చీఫ్ ఇంజనీర్, విశాఖపట్టణం పోర్టుట్రస్టు, విశాఖపట్టణం వారికి పెట్టుకొనే దరఖాస్తుకు జతపరచి పంపి పొందవచ్చును. పోస్టులు చార్జీలు క్రింద రు. 10/-లు అదనంగా చెల్లించినచో డాక్యుమెంట్లు పోస్టు ద్వారా పంపబడును. టెండరు డాక్యుమెంట్లు మరియు పోస్టులు చార్జీలు క్రింద చెల్లించిన సొమ్ము ఎట్టి పరిస్థితులలోనూ వాపసు ఇవ్వబడదు.

ప్రతి టెండరుదారు, ఎర్నెస్టుమని డిపాజిట్, ఫైనాన్షియల్ అడ్వయిజర్ & చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, విశాఖపట్నం పోర్టు ట్రస్టు వారికి రొక్కంగా చెల్లించి నగదు రసీదు పొందాలి లేదా ఎఫ్.ఎ.&సి.ఎ.ఓ. విశాఖ పేర విశాఖపట్నంలో చెల్లింపు అయ్యేలా షెడ్యూల్డుబ్యాంకినుండి పొందిన డిమాండ్ డ్రాఫ్టుద్వారా చెల్లించాలి.

టెండరుదార్లు, ఎర్నెస్టుమని డిపాజిట్ విడి కవరులో పెట్టి, నీలుచేసిన కవరు పైభాగాన జతపర్చాలి.

మొదట ఎర్నెస్టుమనీ డిపాజిట్ కలిగి వున్న కవరు తెరువబడును. ఎర్నెస్టుమనీ డిపాజిట్ దాఖలు చేయని ఏ టెండరైనా తెరువబడదు.

పై వాటికి సంబంధం లేకుండానే ఏకారణము చూపకనే ఎవరివైనా టెండరు పత్రములు ఇష్టానుసారంగా అధికారము చీఫ్ ఇంజనీరు, విశాఖపట్టణం పోర్టుట్రస్టువారు రిజర్వు చేసుకొని వున్నారు.

చీఫ్ ఇంజనీర్.

అహమ్మదాబాద్ మహిళకు అవార్డు

మనిలా, ఆగస్టు 8— అహమ్మదాబాద్ కు చెందిన శ్రీమతి ఇలారమేష్ భట్‌కు ఆమె సంఘ సేవకు గుర్తింపుగా 1977 రేమన్‌మాగ్‌సేసే అవార్డు బహూకరించడానికి నిశ్చయించినట్టు ఇటీవల అధికార పూర్వకంగా ప్రకటించారు.

శ్రీమతి భట్ వృత్తి రీత్యా లాయర్. ఆమె సచ్చేమ భారత ప్రాంతంలో మహిళాభ్యుదయానికి నిరుపమాన కృషి జరిపారు. వస్తు విక్రయాన్ని స్వయంఉపాధిగా చేపట్టడంలో మహిళలకు ఆమె నిర్మాణ కార్యకర్తగా,ఉపదేశకురాలుగా కృషి చేశారు. ఈమె వయస్సు 44 సంవత్సరాలు.

1957లో జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన కీర్తిశేషుడైన ఫిలిప్పయిన్స్ ప్రెసిడెంట్ స్మారకార్థం ఏటా ఇచ్చే బహుమతులలో ఇదొకటి.

మహాత్మాగాంధి బోధించిన సత్యం, అహింస, స్వయంసహాయ మార్గాలను ఆమె ఆచరణలో పెట్టారని, సమాజంలో అట్టడుగునవుండి స్వయం ఉపాధితో జీవితం సాగిస్తున్న మహిళలకు ఆమె చేసిన సేవలు నిరుపమానమైనవని ఈ బహుమతి ప్రదాన సంస్థ పేర్కొన్నది.

వైస్-ఛాన్సలర్ పదవి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8 — వైస్ ఛాన్సలర్ అయితే 10 సంవత్సరాలు, ప్రిన్సిపాల్‌గా వుంటే అయిదు సంవత్సరాలు. కాబట్టి పదవి గనుక అయితో రెండు సంవత్సరాలుఅయు ప్రమాణంతగ్గుతుంది. ఇప్పుడు నా వయస్సు 47. ఈ పదవులన్నీ నేను చేపట్టాను కనుక మరొక 17 సంవత్సరాలు కలిపితే నా వయస్సు 64 సంవత్సరాలన్నమాట, అని కొత్తగా ఉస్మానియా వైస్-ఛాన్సలర్ అయిన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి మొన్నతనకు జరిగిన అభినందనసభలో చెప్పారు.

25 లక్షల ఏళ్ళ క్రితం ఉక్రెయిన్ సముద్రమా?

పారిస్, ఆగస్టు 8— ఉక్రెయిన్‌లోని సమీపంలోని ఉప్పుగనులలో కనిపించిన శిల 25 లక్షల ఏళ్ళనాటిదని. ఒకప్పుడు ఆ ప్రాంతం సముద్రంగా వుండేదని దీనివల్ల ద్రువపడుతున్నదని "మాస్కో న్యూస్" పత్రిక పేర్కొన్నది.

ఆ శిలపై సముద్రంలో పెరిగే ఒకరకపు కిలువపువ్వు ముద్రవున్నదని ఆ పత్రిక పేర్కొన్నది.

హర్యానాలో విషమిస్తున్న వరద పరిస్థితి: రాజస్థాన్‌లో 44 మంది మృతి

చండీగఢ్, ఆగస్టు 8— సాహిబ్‌వాడి లోను, ఎనిమిదవ నంబర్ డ్రెయిన్‌లోను నీటిమట్టం ఇంకా పెరుగుతుండడంవల్ల హరియానాలో వరద పరిస్థితి మరింత క్షీణించినట్టు నిన్న ఇక్కడకు అందిన అధికార వర్తమానం వల్ల తెలుస్తున్నది.

రోహతక్, గుర్గాన్ జిల్లాలలో పరిస్థితి విషమంగానే వున్నది. వరదనీటిలో వున్న గ్రామాలలోని ప్రజలకు విమానాలద్వారా ఆహారం పొట్లాలు, మందులు జారవిడవడం, సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు కార్యక్రమాలు బాగా కొనసాగుతున్నాయి.

హరియానా గవర్నర్ శ్రీ జైకిషన్‌లాల్ హాథీ, ముఖ్యమంత్రి శ్రీ దేవీలాల్ తమ రెండున్నర మాసాల వేతనాలను వరద సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.

కష్టాలలోవున్న తోటిసోదరులను ఆదుకోవడానికై ఉదారంగా విరాళాలివ్వవలసిందిగా వరదలకుగురికాకుండావున్న ప్రాంతాల ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తిచేశారు.

వరదలవల్ల ఇక్కట్లు పాలయిన హరియానా ప్రజలకు పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ ప్రకాశ్ సింగ్‌బాదల్ తన ప్రగాఢ సానుభూతిని తెలియపరస్తూ సహాయకచర్యలలో పూర్తి సహకారాన్ని అందివ్వగలమని హామీ ఇచ్చారు.

హరియానాలోని గుర్గాన్ జిల్లాలో వరదలకు గురయిన గ్రామాలలో భారత వైమానికదళానికి చెందిన హెలికాప్టర్లు ఆహారం పొట్లాలను, ఇతర నిత్యావసర వస్తువులను నిన్న జారవిడిచినట్టు న్యూఢిల్లీ వార్తలు తెలుపుతున్నాయి. హరియానా ప్రభుత్వం కోరినవిదప ఈ హెలికాప్టర్లను వెంటనే రంగంలోకి దింపారు.

యు. పి. ప్రభుత్వం ఉత్తర్వు

లక్నో, ఆగస్టు 8—మథుర, ఆగ్రా, అలీఘర్ జిల్లాలలో భారీఎత్తున వరద సహాయకచర్యలు చేపట్టవలసిందిగా ఆగ్రా డివిజన్ కమిషనర్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది.

మథుర జిల్లాలో వరద నీటిలో చిక్కుకుని వున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికిగాను 19 పడవలను రంగంలోకి దించారు. ఈ జిల్లాలో భారీ వర్షాలవల్ల వచ్చిన వరదలలో 620 గ్రామాలలోని 8,21 లక్షల మంది ప్రజలు చిక్కుకున్నారు.

మూడు వేలకు పైగా గృహాలు దెబ్బతిన్నాయి. 432 పశువులు చనిపోయాయి.

హార్దోయ్ జిల్లాలో గంగానది నీటిమట్టం పెరుగుతున్నట్టు, కుందానది వరద నీరు ఎనిమిది వందల గ్రామాలలోకి ప్రవేశించినట్టు అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. నైనీవద్ద తప్ప మిగిలిన అన్ని ప్రాంతాలలోను యమునానది నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతున్నది.

రాజస్థాన్‌లో సహాయ చర్యలు

జైపూర్, ఆగస్టు 8— రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాలో వరదదెబ్బతిన్న ప్రాంతాలలో గైకొంటున్న సహాయక చర్యలలో సైన్యం కూడా తోడ్పడుతున్నది.

మోతీఝిల్ ప్రాంతంలో వరదనీటిలో చిక్కుకున్న ప్రజలకు సైన్యం ఆహారం సరఫరాచేసింది. కుమేర్ ప్రాంతంలోవరద నీటిలోవున్న ప్రజలను సైన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో నిమగ్నమై వున్నది. అల్వార్ జిల్లాలో కూడా సైన్యం సహాయక చర్యలు గైకొంటున్నది.

రాష్ట్రంలో వరదలవల్ల, భారీ వర్షాలవల్ల ఇంతవరకు 44 మంది మృతిచెందినట్టు నిన్నరాత్రి ఇక్కడ అధికారపూర్వకంగా తెలిసింది. ఇళ్ళు కూలిపోవడంవల్ల ఈ మరణాలు సంభవించాయి.

వరదల వల్ల దాదాపు నాలుగు కోట్ల రూపాయల విలువైన ఆస్తి నష్టమైనట్టు అంచనా వేశారు. రాష్ట్రంలో వరద పరిస్థితి గురించి ముఖ్యమంత్రి శ్రీ భైరన్‌సింగ్ షెఖావత్ ప్రధానమంత్రి శ్రీ మొరార్జీకి తెలియచేసినట్టుగా తెలుస్తున్నది.

తక్కువీవుణంగా రాష్ట్రానికి రెండు కోట్ల రూపాయలు కేటాయించవలసినదిగా ఆయన అభ్యర్థించారు.

ఇక మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్‌కు, దేశం ఇతర ప్రాంతాలకు రోడ్డు సంబంధాలు తెగిపోయాయి. జబల్‌పూర్‌కు వెళ్ళే అన్ని రోడ్లపైన వరద నీరు ప్రవహిస్తున్నది. మధ్యప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలలోకూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

భారత, యుగోస్లావ్ మైత్రి అభివృద్ధికి కృషి

శ్రీ సంజీవరెడ్డి, టిటో విశ్వాసం

న్యూఢిల్లీ, ఆగస్టు 8—అలీన దేశాలైన ఇండియా, యుగోస్లావియాలమధ్య కొనసాగుతున్న సత్యత, సహకార సంబంధాలు అభివృద్ధి చెందడం రానున్న సంవత్సరాలలో కొనసాగగలదని ఉభయ దేశాల అధ్యక్షులు తమ విశ్వాసం వ్యక్తంచేశారు.

భారత రాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా శ్రీ సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ, ఉభయ దేశాల మధ్యగల సాంప్రదాయ స్నేహ సంబంధాలు పరస్పర సహకారంలో, ప్రపంచంలో మరింతన్యాయమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ స్థాపన కృషిలో మరింతగా పెంపొందగలవని విశ్వసిస్తున్నట్టు యుగోస్లావియా అధ్యక్షుడు టిటో పేర్కొన్నారు.

టిటో సందేశానికి కృతజ్ఞత తెలుపుతూ, ఉభయదేశాల ప్రజల శ్రేయస్సు, అంతర్జాతీయ శాంతి, సుస్థిరత, అవగాహనకు దోహదకరంగా స్నేహ సంబంధాలు పెంపొందగలవన్న తమ విశ్వాసాన్ని శ్రీ సంజీవరెడ్డి వ్యక్తంచేశారు.

మద్రాసు నగరంలోని కాలేజి విద్యార్థి ప్రతినిధులలో చర్చలు జరిపిన అనంతరం ఒక నెలరోజులుగా సాగిస్తున్న ఆందోళనను విరమించడానికి విద్యార్థులు అంగీకరించారని తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ ఎం.జి. రామచంద్రన్ ప్రకటించినట్టు మద్రాసు వార్త.

"శ్రీమతి గాంధిని జనతా ప్రభుత్వం క్షమించబోదు"

—శ్రీ రాజ్‌నారాయణ్ ప్రకటన

బెంగుళూరు, ఆగస్టు 8— అత్యాచారాలు, అన్యాయాలు చేశారనిచెప్పే మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధిని జనతా ప్రభుత్వం క్షమించబోదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీరాజ్ నారాయణ్ నొక్కిచెప్పారు.

నిన్న ఇక్కడ పత్రికలవారితో మాట్లాడుతూ, దేశంలో అమలులోవున్న చట్టాలననుసరించి ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

ఇంత వరకు శ్రీమతి గాంధిని ఎందువల్ల అరెస్టుచేయలేదు అని ప్రశ్నించగా, అత్యయిక స్థితికాలంలో జరిపిన అత్యాచారాలపై విచారణ జరపడానికి కేంద్రం ఒక కమిషన్‌ను నియమించిందని, ఆరోపణలు రుజువైతే, ఆమెను అరెస్టు చేయడం జరుగుతుందని, అందులో ఎటువంటి జాప్యం జరగదని ఆయన సమాధానమిచ్చారు.

శ్రీమతి గాంధి: రాజకీయాలు

మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి ఎప్పుడూ రాజకీయాలలో లేదని కేంద్ర మంత్రి శ్రీ రాజ్‌నారాయణ్ చెప్పారు.

పత్రికా విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ, శ్రీమతి గాంధి రాజకీయాలను ఎప్పుడూ అవగాహన చేసుకోలేదని, కుట్ర, కుతంత్రాలు మాత్రమే ఆమెకు తెలుసని ఆయన అన్నారు.

తనకు, శ్రీమతి గాంధికి మధ్య వ్యక్తిగత శత్రుత్వం ఏమీలేదని శ్రీ రాజ్‌నారాయణ్ చెప్పారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ; మరి 30 సంవత్సరాలవరకు శ్రీమతి గాంధి అధికారంలోకి తిరిగి రాలేదని ఆయన తెలిపారు.

దేశంలో ఆహారోత్పత్తుల పెరుగుదల

ప్రణాళికా సంఘం అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 8— 1962-65 నుంచి 1970-73 సంవత్సరాల మధ్యకాలంలో దేశంలో వ్యవసాయోత్పత్తుల పెరుగుదల రేటు 1.95 శాతమని ప్రణాళికా సంఘం జరిపిన పరిశోధనాధ్యయనంలో తెలిసింది. నాల్గవ ప్రణాళికలో వ్యవసాయోత్పత్తుల పెరుగుదల రేటు లక్ష్యం 4.7 శాతం.

ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల రేటు 2.74 శాతం వుంది. వీటి పెరుగుదల రేటు లక్ష్యం నాలుగు శాతం. జనాభా పెరుగుదల రేటు 2.24 శాతం కన్నా ఇది స్వల్పంగా మాత్రమే ఎక్కువ.

282 జిల్లా యూనిట్లలో "ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల, జిల్లావారీ అధ్యయనాన్ని" జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీకి చెందిన ప్రాంతీయాభివృద్ధి అధ్యయన కేంద్రం, ప్రణాళికా సంఘం సంయుక్తంగా నిర్వహించాయి.

ఈ అధ్యయనంలో దాదాపు 19 రకాల పంటల గురించి పరిశీలించడం జరిగింది.

ఆహారోత్పత్తులు పెరిగినప్పటికి,1970-73 మధ్య సంవత్సరాలలో సగటున ఏడాదికి 17.1లక్షల టన్నులదాకా ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవడం జరిగింది. 1962-65 మధ్యకాలంలో తలసరి లభించే ఆహార ధాన్యాలు 458.6 గ్రాములనుంచి 1970-73 మధ్యకాలంలో450.6 గ్రాములకు తగ్గిందని అధ్యయనంలో వెల్లడైంది. అయితే, అదే కాలంలో తలసరి అదాయం .98 శాతం పెరగడం గమనించదగ్గ అంశం.

ఆహార ధాన్యాల గిరాకీ, సరఫరాలో సమతూకం దెబ్బతినేట్టు వుండడం, ప్రతి సంవత్సరం హెచ్చుతగ్గులు వుండడం ఈ పరిస్థితి తీవ్రం కావడానికి కారణమని కూడా అధ్యయనంలో తేలింది.

పరిశీలించిన 19 రకాల పంటల సాగు బడి విస్తీర్ణం 12.4 కోట్ల హెక్టారుల నుంచి 12.7 కోట్లకు పెరిగింది. ఇది 0.3 శాతం పెరుగుదలను సూచిస్తున్నది. ఉత్పాదక శక్తికూడా హెక్టారుకు 853 రూపాయల నుంచి 973 రూపాయలకు. 1.66 శాతం రేటున వేగంగా పెరిగింది.

1960వ దశకంలో వ్యవసాయోత్పత్తుల విలువ 1058.9 కోట్ల రూపాయలు కాగా, అది 1970 వ దశకంలో 1236.25 కోట్ల రూపాయలకు పెరిగింది.

ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో మినహా ప్రతి రాష్ట్రంలోను వ్యవసాయోత్పత్తి పెరిగింది.

గోధుమ ఉత్పత్తి 1.34 కోట్ల టన్నులు పెరిగింది. అధ్యయనం చేసిన కాలంలో తృణధాన్యాల ఉత్పత్తి కూడా పెరిగింది. అయితే, కాయధాన్యాల ఉత్పత్తి తగ్గింది. బియ్యం ఉత్పాదకశక్తి హెక్టారుకు 1015 కిలోల నుంచి 1100 కిలోలకు పెరిగింది.

మాజీ ఎం. పి. లకు పెన్షన్ రద్దుకై విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 8 — మాజీ ఎం.పి.లకు పెన్షన్ చెల్లించడాన్ని రద్దుచేసే నిమిత్తం ఎట్టి ఆలస్యం లేకుండా బిల్లు తీసుకురావాలని మొన్నటిలోకసభలో ఇండిపెండెంట్ సభ్యుడు శ్రీ పి. జి. మావలంకర్ ప్రభుత్వాన్ని కోరారు.

మాజీ ఎం. పి. లకు పెన్షన్ ఇవ్వడానికి ఆర్థిక పరిస్థితిలో చేసిన నిర్ణయం పట్ల విరుద్ధమైన నిర్ణయమనీ, అన్యాయమని శ్రీ మావలంకర్ పేర్కొన్నారు.

ఈ సమస్యను పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ఇంతవరకు ఎటువంటి చర్య తీసికోలేదని శ్రీ మావలంకర్ విచారం చేశారు.

అంతకు స్పీకర్ శ్రీ కె. ఎస్. హెగ్డే జోక్యం చేసుకుని, జనతా ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాలు చాలా వున్నాయనీ, అయితే, వాటన్నిటిని ఒకేసారి నెరవేర్చడం సాధ్యపడదని వ్యాఖ్యానించారు.

విద్యార్థి ఫెడరేషన్ జిల్లా యూనిట్ సమావేశం

రాజమండ్రి, ఆగస్టు 8—అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ తూర్పు గోదావరి జిల్లా యూనిట్ సమావేశం ఇక్కడ శ్రీ ఆర్. ఆదివారాయణ అధ్యక్షతన జరిగింది. జిల్లా కన్వీనరు శ్రీ కిర్ల కృష్ణారావు వివేదిక సమర్పించారు.

అనంతరం రాష్ట్రంలో అన్ని జిల్లాలో గల పక్షపాతరహితంగా విడుదల చేయాలని, ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్‌వరకు ఉచిత విద్యా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికివిజ్ఞప్తి చేశారు. రాజమండ్రి,రాజోలు, రామచంద్రాపురం, కాకినాడలో "స్టడీసర్కిల్సు" నిర్వహణకు నిర్ణయించారు.

అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెసు జనతా పార్టీలో విలీనం

ఐతాసగర్, ఆగస్టు 8 — జనతా పార్టీలో పూర్తిగా విలీనం కావాలని అరుణాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ నిర్ణయించుకుంది.

రాష్ట్రంలో జనతాపార్టీలో సభ్యులను చేర్పించడానికి చర్యలు తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రి శ్రీ పి.కె. తుంగన్‌కు జనతా పార్టీ కేంద్ర నాయకులు అధికారమిచ్చినందుకు నిన్న ఇక్కడజరిగిన మాజీకాంగ్రెస్ నాయకుల సమావేశంలో హర్షం వెలిబుచ్చారు.

శ్రీ తుంగన్‌కు జనతాపార్టీ ప్రధానకార్యదర్శి శ్రీ నానాజీదేశ్‌ముఖ్ వ్రాసిన లేఖ వల్ల మాజీ కాంగ్రెసు వాదులందరిని జనతా పార్టీలో చేర్చుకోవడానికి అంగీకరించినట్టయిందని సమావేశంలో ప్రసంగించిన వక్తలు పేర్కొన్నారు.

అయిదుగురుమంత్రులు, శాసనసభలోని ఆరుగురు మినహా మిగిలిన సభ్యులందరిలో సహా మొత్తం 60 మంది నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్షమైన పీపుల్స్‌పార్టీ కూడా జనతా పార్టీలో విలీనం కావాలని నిర్ణయించింది.

తమిళనాడు ప్రభుత్వం సిబ్బంది జీతాలపై కొత్తకమిషన్ ఏర్పాటు

మద్రాసు, ఆగస్టు 8 — తమిళనాడు ప్రభుత్వం తన ఉద్యోగుల జీతాల సమస్యలను పరిశీలించడానికి మూడవ కమిషనును నియమించింది. దీనికి హైకోర్టు రిటైర్డు జడ్జి శ్రీ ఆర్. సదాశివమ్ అధ్యక్షుడుగా నియమితులైనారు.

ఈ విషయాన్ని ఆర్థికమంత్రి శ్రీ కె. మనోహరన్ మొన్న అసెంబ్లీలో ప్రకటించారు. ఈ కమిషన్‌లోని ఇతర సభ్యుల పేర్లను ఆగస్టు 15 వ తేదీన ప్రకటించగలమని ఆయన తెలియజేశారు.

పట్టణ స్థలాల గరిష్ఠ పరిమితి చట్టం

పట్టణ స్థలాల గరిష్ఠ పరిమితి చట్టంలో ఇప్పుడు ఎన్నో వైరుధ్యాలు కనిపిస్తున్నవని ఆయన చెప్పారు. ఈ చట్టాన్ని అమలు చేస్తున్న అధికారులతో సంప్రదింపులు జరిపిన తర్వాత రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా అసలు శాసనాన్ని సవరించడానికి ముఖ్యమంత్రి అంగీకరించినట్టు ఆయన ప్రకటించారు.

ఇటాలియన్ నౌకాదళం నౌక "సాన్ గియోర్గియో" బొంబాయి నుంచి శుక్రవారం నాడు కొచ్చిన్ రేవుకు వచ్చింది.

వర్గీకృత ప్రకటనలు

గ్రుడ్డి (Blind) వధువు కావలెను

నా జీవితంలోకి నేను ఓ గ్రుడ్డి అమ్మాయి (Blind Girl)ను భార్యగా పొందాలని కోరుకుంటున్నాను. నా ఆలోచనకు చివరి ప్రయత్నమే ఈ ప్రకటన. 25 సం॥లోపు వయస్సు కలవారు వెంటనే క్రింది అడ్రసుకు ఫొటోతో సంప్రదించండి.

N. Mallikarjana Rao,
C/o. N. Hanumaiah,
Old Pattabhipuram,
Near Post Office, GUNTUR-6

కావలెను

జె. ఎమ్. జె. కాలేజీ ఫర్ ఉమెన్: తెనాలి

జూలాజీలో తెలుగు మరియు ఇంగ్లీషులో తరగతులు నిర్వహించగల ఎమ్. ఎస్సి. I లేదా II తరగతి (50%) లేడీ లెక్చరర్ కావలెను. (సెలవు జాగీ).

ఈ ప్రకటన తేదీనుంచి 10 దినముల లోగా కరస్పాండెంటుకు దరఖాస్తుచేయండి. దరఖాస్తు కాపీలను డి. ఇ. ఓ. గుంటూరు మరియు రిజిస్ట్రార్, నాగార్జున యూనివర్శిటీ, నాగార్జునసాగర్, గుంటూరు వారికి కూడా పంపాలి.

కరస్పాండెంటు.

కదలిసాగే ఉత్సాహానికి ప్రతిరూపం...

బ్యాగ్‌పైపర్ విస్కీ

మృదువైనది. మురిపించేది. మనసులరించేది. అధునాతనమైనది దీని రుచి. దీనికిదే సాటి!

ఘనానాదే కావాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. దిగుమతి చేయబడిన మేలైన స్కాచ్ మరియు వాసికెక్కిన భారతీయ మాల్ట్ విస్కీలతో తీరుగా మిశ్రమం చేయబడింది. మ్యాక్డొవెల్ వారి డిస్టిలరీలో తయారు చేయబడింది.

everest/691/HL:tl

జనతా ప్రభుత్వం బడ్జెటు స్వార్థపరులకు అనుకూలం

—కాంగ్రెసు కార్యవర్గం విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 7— జనతా ప్రభుత్వపు ప్రథమ బడ్జెట్టు "ప్రజా వ్యతిరేక" బడ్జెట్టని, "స్వార్థపరులకు అనుకూలంగాను, సమాజంలోని బలహీనవర్గాలపై అధికభారం మోపేదిగాను" వుందని కాంగ్రెసుపార్టీ నేడు విమర్శించింది.

మార్చిలో లోక్‌సభ ఎన్నికల తరువాత కాంగ్రెసు కార్యవర్గం చేసిన మొదటిప్రధాన విధాన తీర్మానంలో ఆ విమర్శ చేశారు.

జనతా పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాలకు, ఆర్థిక విధానాలపై పార్టీ ప్రతినిధి చేసే ప్రకటనలకు బడ్జెట్టు పూర్తిగా విరుద్ధంగా వుందని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

శ్రీ బ్రహ్మానందరెడ్డిపార్టీ అధ్యక్షపదవి స్వీకరించిన తరువాత కార్యవర్గ సమావేశానికి మొదటి పర్యాయం హాజరైన శ్రీమతి ఇందిరాగాంధి ఆ తీర్మానానికి తుది మెరుగులు దిద్దడంలో తోడ్పడ్డారు.

అంతరంగిక పరిస్థితిపై చేసిన తీర్మానంలో, ద్రవ్యోల్బణాన్ని తీవ్రతరం చేసే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తున్నదని ఆరోపించారు. పకాలంలో తగిన రక్షణ యివ్వడంలో జనతాపార్టీ ప్రభుత్వం విఫలమైన దృష్ట్యా హరిజనులు, సమాజంలోని ఇతర తరగతుల అండ విలవలసిందని పార్టీ సభ్యులను కోరారు. 20 అంశాల కార్యక్రమం క్రింద కాంగ్రెసు ప్రభుత్వం కేటాయించిన భూముల నుంచి పెద్దఎత్తున వెళ్ళగొట్టిన పేద ప్రజల అండ నిలబడవలసిందని కోరారు.

అలీన విధానం

నెహ్రూ, టిటో, నాజర్ వంటి ప్రపంచ నాయకులు రూపొందించిన అలీన విధానం మార్గంనుంచి జనతా ప్రభుత్వం వైదొలగబోదన్న ఆశాభావాన్ని కార్యవర్గం నేడు వ్యక్తంచేసింది.

కార్యవర్గం ఆమోదించిన తీర్మానంలో ప్రస్తుత ప్రభుత్వం అలీన విధానంపట్ల విశ్వాసం వ్యక్తంచేసి, దానికి కట్టుబడి వుంటామని ప్రకటించినప్పటికీ, తమది "వాస్తవమైన" అలీన విధానమని నొక్కిచెబుతున్నదని, అందువల్ల అనుమానం కలుగుతున్నదని ఆ తీర్మానంలో గుర్తుజేశారు.

ఈ సందర్భంగా హిందూ మహాసముద్రం ప్రాంతంలో శాంతికి ప్రమాదం పెరుగుదలపట్ల కార్యవర్గం ఆందోళన వ్యక్తం చేసింది.

కాంగ్రెసు కార్యవర్గ సమావేశానికి శ్రీమతి ఇందిరా గాంధి హాజరు

న్యూఢిల్లీ, ఆగస్టు 7—కాంగ్రెసు కార్యవర్గ సమావేశం నేటి మధ్యాహ్నం ఇక్కడ ప్రారంభమైంది.

శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నికైనప్పటి నుంచి కార్యవర్గ సమావేశాలకు హాజరుకాని మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నేటి సమావేశంలో పాల్గొన్నారు.

మొదటి పర్యాయం ప్రత్యేక ఆహ్వానితురాలుగా కాంగ్రెసు మాజీ అధ్యక్షురాలు శ్రీ డి. కె. బారువా కూడా నేటి సమావేశంలో పాల్గొన్నారు.

పార్టీ ఉన్నతస్థాయి విధాన నిర్ణయ సంస్థల చర్చలలో శ్రీమతి ఇందిరాగాంధి నేటి సాయంత్రం స్వయంగా పాల్గొనడం ప్రారంభించడంతో కాంగ్రెసు సమష్టి నాయకత్వం కోసం రూపొందించిన "త్రాయికా" పథకం విఫలమైంది.

పార్టీ విధానాల విషయంలో సంప్రదించడానికి మాజీ ప్రధాని గృహానికి కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ నాయకుడు శ్రీ వై. బి. చవాన్ వెళ్ళాలని లోగడ చేసుకొన్న ఒప్పందం భగ్నం కావడంతో శ్రీమతి గాంధి మద్దతుదార్లు యిటీవల "త్రాయికా"లో ఆమెను చేర్చుకోవాలని ఆందోళన ప్రారంభించారు.

ఈ పథకానికి శ్రీ రెడ్డి, శ్రీ చవాన్‌ల నుంచి ప్రతిఘటన రావడంతో, కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు కార్యవర్గ సమావేశాలకు హాజరుకావాలని శ్రీమతి గాంధి నిర్ణయించుకొన్నారు.

కాంగ్రెసు సంస్థలో పార్టీ విధాన విషయాలలో ఆమె మాటకు అధిక విలువ ఇవ్వడం జరుగుతుందని లాంఛనంగా హామీలు ఇవ్వడంతో శ్రీమతి ఇందిరాగాంధి దిగివచ్చినట్టు కాంగ్రెసు వర్గాలు తెలియజేశాయి.

నాయకుల మధ్య రాజీ మధ్యవర్తిగా కార్యవర్గ సభ్యుడు శ్రీ సి. బ్రహ్మానందం ప్రముఖపాత్ర వహించారు.

కర్నాటక గవర్నర్ పదవికి రాజీనామా చేసిన శ్రీ ఉమాశంకర్ దీక్షిత్ కూడా ఇందుకు కొంత తోడ్పడ్డారు.

ఎ. ఐ. సి. సి. కేంద్ర కార్యాలయానికి శ్రీమతి గాంధి కార్యవర్గ సమావేశానికి నిర్ణయించిన నాలుగు గంటలకు సరిగా హాజరయారు.

శ్రీ బ్రహ్మానందరెడ్డి తమ తొలి ప్రసంగంలో కార్యవర్గ సమావేశానికి శ్రీమతి గాంధి వచ్చిన విషయం ప్రస్తావించలేదు. తీర్మానాలను రూపొందించే కమిటీ తయారుచేసిన మూడు తీర్మానాలను ప్రతి ఒక్కటీ వెంటనే పరిశీలించడం ప్రారంభించారు.

శ్రీమతి గాంధి లాంఛనంగా ప్రసంగం ఏదీ చేయలేదు. కాని, మూడు తీర్మానాలకు తుది రూపం ఇవ్వడంలో తోడ్పడ్డారు.

ఢిల్లీలో వరదల బీభత్సం

న్యూఢిల్లీ, ఆగస్టు 7—

రాజధానిలో, చుట్టు ప్రక్కల సుమారు 1,800 చదరపు కిలోమీటర్ల ప్రాంతం వరద నీటిలో మునిగివుంది.

ఢిల్లీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ శ్రీ కిదార్‌నాథ్ సహానీ ఈ విషయాన్ని వెల్లడించారు. పరిస్థితి పూర్తిగా అదుపులో వుంది. కాని ఇంకా జాగ్రత్తవహించవలసిన అవసరం వుందని ఆయన చెప్పారు. రాగల 48 గంటలలో ఊహించరానటువంటి సంఘటనలు జరగకపోతే, యమునా నదిలోకి వరద నీటి ప్రవాహాన్ని క్రమబద్ధం చేయగలమని ఆయన పేర్కొన్నారు.

వరదముంపు ప్రాంతాలనువిమానంనుంచి సర్వే చేసే కార్యక్రమాన్ని అధికారులు తిరిగిచేపట్టారని శ్రీ సహానీ తెలియజేశారు. వరదలవల్ల పెద్దమొత్తంలోపంటలకు నష్టం సంభవించిందని, అనేక రోడ్లకు గండ్లు పడినాయని, పెక్కు బ్రిడ్జిలు కూలిపోయాయని ఆయన చెప్పారు.

క్రకోలా రెగ్యులేటర్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో నజాఫ్‌ఘర్ డ్రెయిన్‌కు గండిపడిన కారణంగా ఢిల్లీ శివార్లలోని నజాఫ్‌ఘర్ పట్టణానికి వరద ముంపు ప్రమాదం ఏర్పడింది.

నజాఫ్‌ఘర్ డ్రెయిన్‌కు 40 అడుగుల వెడల్పుగల గండిపడినట్టు తెలుస్తున్నది. తమ గ్రామాలను వరద ముంపు నుంచి రక్షించుకోవడానికి కొంతమంది వ్యక్తులు డ్రెయిన్‌కు గండిపెట్టినట్టు ధృవపడని వార్తలద్వారా తెలియవచ్చింది.

నజాఫ్‌ఘర్ డ్రెయిన్ వరద నీటివల్ల పశ్చిమ ఢిల్లీలో దెబ్బతిన్న రెసిడెన్షియల్ కాలనీలను, గ్రామాలను సందర్శించిన "సమాచార్" విలేకరులు వరద బాధితులకు సహాయకార్యక్రమాలు అమలు జరుగుతుండడం చూశారు. నజాఫ్‌ఘర్ ప్రాంతంలోని 12 పాఠశాలల భవనాలలో వరద బాధితులు పునరావాసానికి సహాయ శిబిరాలను ప్రారంభించారు. వరద ప్రమాదంలో చిక్కుకున్న గ్రామీణులను ఖాళీచేయించడానికి, అంటువ్యాధులు రాకుండా నిరోధించడంలో సైన్యాధికారులు ఆక్కులతో, సంచార డిస్పెన్సరీలతో సివిల్ అధికారులకు తోడ్పడుతున్నారు.

వరదబాధితులకు సైన్యానికి చెందిన పడవల సహాయంతో ఆహారం, మందులు, ఇతర అవసరాలను కల్పించడం జరిగింది.

పునరావాస సౌకర్యం ఏర్పాటు చేసిన జహంగీర్‌పురికాలనీ వరదలవల్ల పూర్తిగా దెబ్బతింది. జహంగీర్‌పురి, జగత్పురి, వజీరాబాద్ ప్రాంతాలలోని వరద బాధితులను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సహాయ కార్యక్రమాలలో తోడ్పడేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు వరద ప్రాంతాలకు వెళ్ళాయి. కొన్ని ప్రాంతాలలో వరద బాధితులకు అన్నం పొట్లాలను సరఫరా చేస్తున్నారు.

మూడు వేల క్యూసెక్కుల నీటిని వెలువల పంపే శక్తి కలిగిన క్రకోలీ రెగ్యులేటర్ నిన్న 4,500 క్యూసెక్కుల నీటిని బయటికి పంపింది. నేడు 1,250 క్యూసెక్కుల నీటిని మాత్రమే బయటికి పంపింది.

ధన్సా బండ్, క్రకోలీ మధ్య నజాఫ్‌ఘర్ డ్రెయిన్‌కు అనేక గండ్లు పడిన కారణంగా ఈ కొద్ది మొత్తం నీరు విడుదలయినట్టు ఢిల్లీ పాలనా యంత్రాంగం వరద నిరోధక శాఖాధికారులు వెల్లడించారు.

విజయవాడలో ఆదివారంనాడు జరిగిన "అడవిరాముడు" చిత్రం శతదినోత్సవ సభలో ముఖ్యఅతిథి శ్రీ దిలీప్‌కుమార్ నుంచి మెమొంటోలు స్వీకరిస్తున్న చిత్ర కథానాయకుడు శ్రీ ఎన్. టి. రామారావు, లక్ష్మీ ఫిలింస్ అధినేత శ్రీ కె.ఎల్.ఎన్. ప్రసాద్, నటి జయప్రద, ఫొటోలో ఎడమ వైపున సభకు అధ్యక్షత వహించిన శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, మెమొంటోలు స్వీకరిస్తున్న నిర్మాతలు సూర్యనారాయణ, సత్యనారాయణలను కూడా చూడవచ్చు.

అదనపు డి.ఎ. రెండవ వాయిదా చెల్లింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 7— అదనపు కరవు భత్యం డిపాజిట్ల రెండవ వాయిదా చెల్లింపడంలో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన 15ప్రాంతీయ కార్యాలయాలు విమగ్నమై వున్నట్టు నే డిక్కడ విడుదల చేసిన ఒక అధికార ప్రకటనలో తెలియచేశారు.

ప్రభుత్వకార్యాలయాలు, స్థానికసంస్థలు కాక సుమారు 73 వేల సంస్థలు ఈరెండవ వాయిదా చెల్లింపుకు దరఖాస్తులు పెట్టనున్నాయి.

అదనపు కరవుభత్యం రెండవ వాయిదా చెల్లింపు 87 కోట్ల రూపాయల వరకు వుంటుందని అంచనా.

రెండవ వాయిదా చెల్లింపులను త్వరితగతిన పూర్తిచేయవలసిందిగా కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీ కె.ఎస్.నాయక్ ప్రాంతీయప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లకు ఆదేశాలు పంపారు.

"రాజకీయ పత్తిడులకు లొంగి కొత్తహాల్టులు అనుమతించబోము"

—రైల్వేమంత్రి శ్రీ మధుదండావతే ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 7— రాజకీయ ఒత్తిడులకు లోబడి కొన్నిప్రాంతాలలో కొత్తగా ప్రయాణీకుల హాల్టులను భవిష్యత్తులో రైల్వేలు అనుమతించబోవని కేంద్ర రైల్వే మంత్రి శ్రీ మధుదండావతే తన మంత్రిత్వశాఖ పార్లమెంటరీ సంప్రతింపుల సంఘానికి విన్న హామీ ఇచ్చారు.

గతంలో కొంతమంది రాజకీయవేత్తల పలుకుబడివల్ల కొన్ని ప్రయాణీకుల హాల్టులకు అనుమతించారని. అందువల్ల రైళ్ళ ప్రయాణంలో అనవసరంగా జాప్యం జరిగిందని. నూతనంగా ఏర్పాటైన పార్లమెంటరీ సంప్రతింపుల సంఘం సమావేశంలో కొంత మంది సభ్యులు ఆరోపించారు.

రైళ్ళను కొత్త ప్రయాణీకుల హాల్టులకు అనుమతించడం కోసం, కొన్ని నియమాలను రూపొందించి, వాటికి అంటిపెట్టుకుని వుండాలని ఆయన సూచించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సర కాలంలో రైల్వేల పనితీరు తెన్నులు మెరుగు పరచడంలో సహకరించినందుకు రైల్వే కార్మికులకు మంత్రి శ్రీ దండావతే కృతజ్ఞతలు తెలియజేశారు.

కమిటీ సభ్యులు, చైర్మన్ రైల్వే బోర్డు సభ్యులు నిన్నటి సమావేశానికి హాజరయ్యారు. కమిటీ తొలి సమావేశం అక్టోబరు రెండవ వారంలో బెంగుళూరులో జరపడానికి సమావేశం నిశ్చయించింది.

తెనాలి జైలులో చేనేత సత్యాగ్రహి మృతి

తెనాలి, ఆగస్టు 7— సత్యాగ్రహం చేసి, జైలుశిక్ష అనుభవిస్తున్న చేనేత పని వారలలో శ్రీ కంటివరపు బాపన్నయ్య అనే వ్యక్తి గత రాత్రి ఇక్కడ హృద్రోగంవల్ల మరణించారు.

సత్యాగ్రహం చేస్తున్న శ్రీ టి. భాస్కరరావు అను వ్యక్తికి కూడా గుండెపోటు రాగా, చికిత్సకోసం ఆయనను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్యాగ్రహం చేస్తున్న మరి నలుగురిని కూడా వైద్య సహాయం కోసం గుంటూరు ఆస్పత్రిలో చేర్చారు.

తమ కోర్కెలకు మద్దతుగా స్థానిక ప్రభుత్వ కార్యాలయాలలో పికెటింగ్ జరిపిన 150 మంది పైగా చేనేత పని వారలు (సత్యాగ్రహులు) జైలుశిక్ష అనుభవిస్తున్నారు.

సత్యాగ్రహాన్ని కొనసాగించకుండా చేనేత పనివారలను నిరుత్సాహపరిచేందుకు ప్రభుత్వం అమానుష పద్ధతులను అవలంబిస్తున్నదని చేనేత పనివారల నాయకుడు ఒకరు "సమాచార్"కు తెలియజేశారు. నలుగురిని వుంచడంకోసం నిర్దేశించిన ఒక్కొక్క జైలు గదిని 15 మంది సత్యాగ్రహులతో నింపినట్టు ఆయన ఆరోపించారు.

ఖైదీలు పూపిరాడక మరణిస్తున్నప్పటికీ, అధికారులు ఎటువంటి ఆందోళనను కనబర్చడం లేదని ఆయన ఆరోపించారు.

శ్రీ బాపనయ్య గుండెపోటువల్లనే మరణించారని. అంతే కాని ఊపిరాడక కాదని గుంటూరు పోలీస్ సూపరింటెండెంట్ ధృవపరిచారు.

విజయవాడలో "అడవిరాముడు" చిత్ర శతదినోత్సవ వేడుకలు

విజయవాడ, ఆగస్టు 7— రాష్ట్రంలో 32 కేంద్రాలలో నూరు రోజులు నడిచి అఖండ విజయం సాధించిన సత్యచిత్ర వారి "అడవి రాముడు" చిత్రం శత దినోత్సవం నేటి ఉదయం ఇక్కడ అప్పర థియేటర్‌లో వేడుకగా జరిగింది.

తెలుగు చలనచిత్ర సీమలో అగ్రశ్రేణి నటీనటులతోపాటు, హిందీ సినిమా రంగంలో అగ్రనటుడైన దిలీప్‌కుమార్ కూడా నేటి ఉత్సవానికి రావడంతో, వారిని చూడ వచ్చిన ప్రజానీకంతో థియేటర్ పరిసర ప్రాంతాలు నిండిపోయాయి.

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సభకు శ్రీ దిలీప్‌కుమార్ ముఖ్యఅతిథిగావిచ్చేశారు. కుమారి వాణిశ్రీ, షావుకారు జానకి, శ్రీమతి జమున, దర్శకులు శ్రీ కె. ఎస్. ప్రకాశరావు, శ్రీ కె. విశ్వనాథ్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు.

చిత్ర కథానాయకుడు శ్రీ ఎన్. టి. రామారావు, నటీనటులు జగ్గయ్య, సత్యనారాయణ, గుమ్మడి, నాగభూషణం, శ్రీధర్, రాజబాబు, గోకినరామారావు మాదా, నాయికలు జయప్రద, జయసుధ, కవిత, బేబీ రోహిణి, దర్శకుడు కె. రాఘవేంద్రరావు నిర్మాతలు సత్యనారాయణ, సూర్యనారాయణ, సాంకేతిక నిపుణులు కె. వి. మహదేవన్, కోడగిరి గోపాలరావు, తోట, జంధ్యాల, చేటూరి సుందరరామమూర్తి, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం వేదిక నలంకరించారు.

హీరో శ్రీ ఎన్. టి. రామారావుకు, పంపిణీదారులైన లక్ష్మీ ఫిలింస్ అధినేత శ్రీ కె.ఎల్.ఎన్. ప్రసాద్‌కు, దర్శకుడు శ్రీ రాఘవేంద్రరావుకు, ఇతర నటీనటులకు దిలీప్‌కుమార్ మెమొంటోలు అందజేశారు. సంగీత దర్శకుడు శ్రీ మహదేవన్‌కు దర్శకుడు శ్రీవిశ్వనాథ్, ఎగ్జిబిటర్స్‌కు కుమారి వాణిశ్రీ, శ్రీమతి జమున, సాంకేతిక నిపుణులకు శ్రీమతి జానకి బహుమతులు అందజేశారు.

శ్రీ నాగేశ్వరరావు తమ అధ్యక్షోపన్యాసంలో అడవిరాముడు చిత్రం విజయం అపూర్వమైనదని కొనియాడారు. కథ కంటె, కథనం ముఖ్యమని, ఈ విషయంలో శ్రీ రాఘవేంద్రరావు చూపిన ప్రతిభ అద్వితీయమైనదని శ్రీ నాగేశ్వరరావు ప్రశంసించారు. శ్రీ రామారావు ఏ పాత్ర వేసినా అద్భుతంగా నటించే సమర్థత కలవారన్నారు.

శ్రీ దిలీప్‌కుమార్ ప్రసంగిస్తూ, శ్రీరామారావు మహానటుడన్నారు. సినిమా పరిశ్రమపై ప్రభుత్వం వినోదం పన్ను విధించడంద్వారా మోయలేని భారాన్ని వేస్తున్నదని ఆయన విమర్శించారు. వివిధ రాష్ట్రాలలో వినోదం పన్ను ద్వారా ఏటా 225 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తున్నదని ఆయన చెప్పారు.

శ్రీ ఎన్. టి. రామారావు మాట్లాడుతూ, తెలుగు దేశానికి గౌరవాన్ని సంపాదించిన మహానటుడు శ్రీ నాగేశ్వరరావు అధ్యక్షత న ఈ సభ జరగడం తన అదృష్టమన్నారు. ప్రజాదరణ పొందే డ్రిల్లర్ చిత్రం తీయాలన్న నిర్మాతల ఆశయం ఈ చిత్రం నెరవేర్చిందని ఆయన చెప్పారు.

షావుకారుజానకి, శ్రీమతిజమున, కుమారి వాణిశ్రీ, కుమారి జయప్రద, కుమారి జయసుధ, దర్శకులు శ్రీ కె.ఎస్. ప్రకాశరావు, శ్రీ కె. విశ్వనాథ్, శ్రీ కె. రాఘవేంద్రరావు నటులు సత్యనారాయణ, రాజబాబు, ప్రసంగించారు.

చిత్ర విజయానికి ఆనందం వ్యక్తం చేస్తూ నటీనటులను, దర్శకుడు శ్రీ కె. రాఘవేంద్రరావును ఇతర సాంకేతిక నిపుణులను నిర్మాతలు సత్యనారాయణ, సూర్యనారాయణల అభిరుచిని పలువురు వ్యక్తులు ప్రశంసించారు.

తొలుత శ్రీ జగ్గయ్య స్వాగతం పలికారు. నిర్మాత శ్రీ సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. అనంతరం థియేటర్ బయట పెచివున్న వేలాది అభిమానులు చూడడానికి వీలుగా నటీనటులు వెలుపలకు వచ్చి అభివాదాలు చేశారు. ప్రజలను అదుపు చేయడానికి పోలీసులు ఎంతో శ్రమపడవలసి వచ్చింది.

లారీ బోల్తాపడి 12 మంది మృతి

మరి 13 మందికి గాయాలు

మద్రాసు, ఆగస్టు 7—ఇక్కడికి 175 కిలోమీటర్ల దూరంలోని పాడూర్ వద్ద విన్న ఒక లారీ బోల్తాపడగా, అందులో ప్రయాణంచేస్తున్న 12 మంది వ్యక్తులు మృతిచెందగా, మరి 13 మంది గాయపడ్డారు.

మెట్టూరు నుంచి మద్రాసుకు రాళ్ళను తీసుకువస్తున్న ఈ లారీలో అతూరు వద్ద ప్రయాణీకులు ఎక్కినట్టు పోలీసులు తెలియజేశారు. గాయపడినవారు ఉలందూర్‌పేట, కడలూరు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నట్టు వారు తెలిపారు.

కేసు నమోదుచేసి, లారీ డ్రైవర్‌ను కస్టడీలోకితీసుకున్నట్టు పోలీసులు చెప్పారు.

కలకత్తా, ఆగస్టు 7—వరక్కా చర్చలలో ఇండియా, బంగ్లాదేశ్‌లు తమ మధ్య విభేదాలను మరింత తగ్గించుకున్నాయని శ్రీ జగన్ మోహతా విన్న రాత్రి ఇక్కడ అన్నారు.

లోక్‌సభ నుంచే పార్టీ నాయకుని ఎన్నిక

జనతా పార్లమెంటరీ పార్టీ నియమావళి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 7— జనతా పార్లమెంటరీ పార్టీ సర్వసభ్య సమావేశం నే డిక్కడ ఆమోదించిన నియమావళిలో, లోక్‌సభ నుంచే పార్టీ నాయకుణ్ణి ఎన్నుకోవాలని నిర్దేశించారు.

పార్లమెంటరీపార్టీ కార్యవర్గం ఆమోదించిన ముసాయిదా నియమావళిలో నిర్దిష్టంగా ఎవరిని ఎన్నుకోవాలనేది లేదు. శ్రీ హెచ్. వి. కామత్ ప్రతిపాదించిన ఆ సవరణను పార్టీ సర్వసభ్య సమావేశం ఆమోదించింది.

హైదరాబాద్, ఆగస్టు 7—గత మూడవ తేదీన గుండెపోటువల్ల మరణించిన సైప్రస్ అధ్యక్షుడు మకారియోస్ గౌరవార్థం రేపు హైదరాబాద్‌లో భవనాలపైగల జాతీయ పతాకాలను అవనతంచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

విభేదాలను విస్మరించి పార్టీ పటిష్ఠతకు కృషి

—బీహార్ పి. సి. సి. నాయకుల నిర్ణయం

పాట్నా, ఆగస్టు 7—తమ విభేదాలను విస్మరించి, పార్టీ పటిష్ఠతకోసం సమైక్యంగా కృషిచేయాలని నే డిక్కడ జరిగిన బీహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి చెందిన ప్రముఖ నాయకుల సమావేశం ఒక నిర్ణయాన్ని గైకొన్నట్టు శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ రామలక్ష్మణ్‌సింగ్ యాదవ్ వెల్లడించారు. ఈ సమావేశం మూడు గంటలపాటు జరిగింది.

ముఠా తత్వాలను తొలగించి, పార్టీని పటిష్ఠంచేయడంలో ముఖ్యపాత్ర నిర్వహించిన బీహార్ పి.సి.సి. మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ యాదవ్ "సమాచార్" ప్రతినిధిరో మాట్లాడుతూ; చర్చల ఫలితాల పట్ల తన సంతసం వ్యక్తంచేశారు.

పార్టీ పటిష్ఠతకోసం బీహార్ పి.సి.సి.లోని ప్రముఖ నాయకులందరూ కలసికట్టుగా కృషి చేస్తారని ఆయన చెప్పారు.

శ్రీ యాదవ్ నివాస గృహంలో జరిగిన ఈ సమావేశానికి బీహార్ పి. సి. సి. నూతన అధ్యక్షుడు శ్రీ కేదార్‌పాండే, మాజీ ముఖ్యమంత్రులు డాక్టర్ జగన్నాథ్ మిశ్రా, శ్రీ అబ్దుల్ గఫూర్, మాజీ మంత్రి శ్రీ చంద్రశేఖర్‌సింగ్ ప్రభృతులు కూడా హాజరయ్యారు.

ఎ.ఐ.సి.సి. ప్రధాన కార్యదర్శి శ్రీ కె. సి. పంత్ శ్రీ కేదార్‌పాండేను పి. సి. సి. నూతన అధ్యక్షునిగా, మరి 21 మందిని కార్యవర్గ సభ్యులుగా నామినేట్ చేయడం వల్ల బీహార్ పి.సి.సి.లో అసాధారణ ముఠాతత్వాలు ఏర్పడ్డాయి. పి.సి.సి. చీఫ్‌ను, కార్యవర్గ సభ్యులను నామినేట్ చేయడానికి పి.సి.సి. సభ్యులు శ్రీ పంత్‌కు అధికార మిచ్చారు.

పారిశ్రామిక శాంతికి హామీగా తగినచర్యలు

మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రధాని శ్రీ దేశాయి సలహా

న్యూఢిల్లీ, ఆగస్టు 7— రాష్ట్రంలో పారిశ్రామిక శాంతికి హామీగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవలసిందిని మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వసంతరావు పాటిల్‌ను ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయి కోరినట్టు తెలుస్తున్నది.

దేశంలో పారిశ్రామిక అశాంతిని గురించి కొంతవరకు అర్థంచేసుకోవచ్చు. ఆత్యయిక పరిస్థితి కాలంలో అన్ని న్యాయమైన ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలను అణచివేయడం అందుకు కారణం. అయితే, ఎక్కడైనా కార్మికులు చట్టాన్ని తమ చేతులలోకి తీసుకోవడం సరియైనది కాదని శ్రీ దేశాయి గుర్తుజేశారు.

మామూలు నిబంధన ప్రకారం యాజమాన్యంకు, కార్మికులకు మధ్య వివాదాలలో పోలీసులు జోక్యం కలిగింతుకోకూడదని ప్రధాని గుర్తుచేశారు. కాని, కొంతమంది రాళ్ళు దువ్వడంగాని, ఇతర హింసాపద్ధతులను చేపడితే, అవి శాంతికి భంగకరం కావని చెప్పి పోలీసులు చేతులు ముడుచుకు కూర్చోకూడదనిఆయనఅన్నారు. సమష్టి నేరాలకు వ్యక్తిగత నేరాలు భిన్నమైనవి. అటువంటి పరిస్థితులలో పోలీసులు నిర్ణయాత్మకంగాను, సమర్థంగాను పనిచేయాలని శ్రీ దేశాయి చెప్పారు.

ఉత్పత్తికి విఘాతం లేకుండా గ్రామీణ, లఘు పరిశ్రమలకు అధిక ప్రాధాన్యం

పారిశ్రామిక విధానంపై కేంద్ర మంత్రివరం చర్చలలో ఏకాభిప్రాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 7— నేడు జరిగిన కేంద్ర మంత్రివర్గ ఇష్టాగోష్ఠి సమావేశంలో ప్రస్తుత పారిశ్రామిక విధానం గురించి, ప్రత్యేకంగా గ్రామీణ, లఘు పరిశ్రమలలో ఏ వస్తువులు ఉత్పత్తి చేయాలన్నది నిర్దిష్టంగా గుర్తించే విధంగా చర్చలు జరిపినట్టు తెలుస్తున్నది.

నేటి ఉదయం 11—00 గంటలకు రక్షణ శాఖ మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ ఇంట్లో ప్రారంభమైన ఆ సమావేశం రెండు గంటలపాటు జరిగింది.

కేంద్ర క్యాబినెట్ మూడవ ఇష్టాగోష్ఠి సమావేశం సమాచార, ప్రసారశాఖ మంత్రి శ్రీ ఎల్. కె. అద్వాని నివాస భవనంలో ఆగస్టు 16 వ తేదీన జరుగుతుంది.

నేటి సమావేశంలో ప్రధాన మంత్రి, ఇతర కేంద్ర మంత్రులుగాక, జనతాపార్టీ అధ్యక్షుడు శ్రీ చంద్రశేఖర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి. టి. లక్డావాలా కూడా పాల్గొన్నారు.

దేశంలో ఉపాధి అవకాశాలు అధికం చేయడానికి గ్రామీణ, లఘు పరిశ్రమలపై ఎక్కువ శ్రద్ధ వహించాలని జనతాపార్టీ దీక్షతో వుంది. ప్రస్తుతం భారీ పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్న వినియోగ వస్తువుల పరిశ్రమలు కూడా ఇందులోకి వస్తాయి.

తుది నిర్ణయాలు ఏవీ చేయకపోయినప్పటికీ, ఉత్పత్తికి దెబ్బతగలని విధంగా గ్రామీణ, లఘు పరిశ్రమలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో పారిశ్రామిక విధానాన్ని అన్ని కోణాల నుంచి పరిశీలించాలని సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తం అయ్యింది

జనతాపార్టీలోని కొంతమందికి చక్కెర, జౌళి, ఇతర రంగాలలో భారీ పరిశ్రమలకు కొత్త లైసెన్సులు ఇవ్వకూడదన్న తీవ్ర భావాలు వున్న విషయం తెలిసిందే. అదనపు గిరాకిని పూర్తిగా లఘు పరిశ్రమల రంగం నుంచి ఎదుర్కోవాల్సనది వారి అభిప్రాయం. 1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో ఈ వైఖరికి అవరోధం కల్పించే అంశం ఏదీలేదు.

కాని, ఉత్పత్తిని, సుస్థిర ధరల స్థాయిని నిలకడగా వుంచాలన్న విస్తృత ప్రయోజనాల దృష్ట్యా,భారీ పరిశ్రమలకు, లఘు పరిశ్రమలకు మధ్య సమతూకం నిర్వహిస్తున్న ప్రస్తుత పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం మార్పు చేయరాదన్న అభిప్రాయం కూడా చెప్పుకోదగినంత మందిలో వుంది. అదనంగా చక్కెర ఉత్పత్తిగాని, వస్త్రాల ఉత్పత్తిగాని లఘు పరిశ్రమల రంగంలో కొనసాగిస్తే సహజ వనరులు ఎక్కువగా వృధా కావడానికి దారితీస్తుందని వారి భావన. ఖండసారి మిల్లు ద్వారా కంటే భారీ పరిశ్రమ ద్వారా చక్కెర దిగుబడి ఎక్కువ వస్తుంది. అదే విధంగా ప్రత్తి వినియోగం విషయంలో గాని, ధాన్యం మరబట్టడంలో గాని జరుగుతుంది.

ఈ ప్రశ్నలలో కొన్ని ఇంతకుముందే ప్రణాళికా సంఘం సమావేశాలలో చర్చకు వచ్చాయి. ఆ సమస్యపై పూర్తి దర్యాప్తుకు వ్యవధికావాలని ప్రణాళికా సంఘం కోరినట్టు అభిజ్ఞవర్గాలు తెలియజేశాయి.

పారిశ్రామిక విధానంగాక,వ్యవసాయం, కార్మిక రంగాలకు సంబంధించిన సమస్యలు కూడా చర్చించారు.

వాతావరణం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 7— తెలంగాణలో ఋతుపవనాలు చురుకుగా వున్నాయి. కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో వర్షపాతం అక్కడక్కడా వుండగా రాయలసీమలో వాతావరణం పొడిగా వుంది

రాగల 48 గంటలలో ఖమ్మం, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాలలో ఒక మాదిరి నుంచి భారీ వర్షాలు పడే సూచనలు వున్నాయి. తెలంగాణాలోని మిగిలిన ప్రాంతాలలో, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలో ఒకమాదిరి వర్షాలు పడే సూచనలు వుండగా రాయలసీమలో ఆకాశం మేఘావృతమై వుంటుంది.

భద్రాచలం, హనుమకొండ, మంథనిలో నాలుగు సెంటిమీటర్లు, వరకాల, వెంకటాపురంలో మూడు సెంటిమీటర్లు, నిజామాబాద్, రామగుండంలో రెండు సెంటిమీటర్ల వర్షపాతం రికార్డు అయింది.

నగరంలో వాతావరణం: గరిష్ఠం: 88 డిగ

డీజెలు, టైర్‌ల వాడకంపై ఆంక్షలవల్ల 2 కోట్లు ఆదా

రోడ్డు రవాణా సంస్థ జనరల్ మేనేజరు వెల్లడి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విజయవాడ, ఆగస్టు 8—డీజెల్ ఆయిలు, ఇంజన్ ఆయిలు, టైర్‌ల వాడకంపై విధించిన ఆంక్షల వల్ల, నిబంధికి కల్పించిన ప్రోత్సాహక చర్యలవల్ల ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ 1976–77లో రెండు కోట్ల రూపాయలకు పైగా పొదుపు చేయగలిగింది.

ఆర్.టి.సి. జనరల్ మేనేజరు శ్రీ ఆర్. ప్రభాకరరావు నేటి ఉదయం ఇక్కడ పత్రికా విలేకరుల సమావేశంలో ఈ విషయం చెప్పారు.

1976-77 లో ఆర్.టి.సి. బస్సుల సంఖ్య 5100 వేలకు పెరిగిందని, బస్సులు తిరిగే దూరం 15 07 శాతం, రాబడి 17.3 శాతం, ప్రయాణీకుల రవాణా 20.33 శాతం పెరిగిందని శ్రీ ప్రభాకరరావు చెప్పారు.

క్రితం ఏడాది మొత్తంమీద 2.71 కోట్ల లాభాన్ని ఆర్. టి. సి. ఆర్జించిందని, ఈ మొత్తాలను వీ స్తరణ కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని ఆయన చెప్పారు.

1977–78లో 521 రూట్‌లను జాతీయం చేసే కార్యక్రమాన్ని ప్రకటించడం జరిగిందని, దీనితో అనంతపురం, కడప, ప్రకాశం చిత్తూరు జిల్లాలలో బస్సుల జాతీయకరణ పూర్తి అవుతుందని, ఇందుకు 848 బస్సులు అవసరమవుతాయని ఆయన తెలియజేశారు.

ఈ ఏడాది 600 పాత బస్సులస్థానే కొత్తవాటిని ప్రవేశపెడుతున్నట్టు జనరల్ మేనేజర్ చెప్పారు. విశాఖపట్నం, తెనాలి, తాడేపల్లిగూడెం బస్‌స్టేషన్‌ల నిర్మాణం పూర్తిఅయిందని. ఏలూరు, తణుకు, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, సత్తెనపల్లి, బాపట్ల, కడప స్టేషన్‌ల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చిందని ఆయన వివరించారు.

విజయవాడకు సమగ్రమైన బస్ స్టేషన్ నిర్మాణానికై స్థల నిర్ణయం ఇంకా జరగవలసివున్నదని, ప్రస్తుతంవున్న బస్ స్టాండును సమీప ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల కోసం స్టాండుగా ఉపయోగించే ఆలోచన వున్నదని ఆయన తెలియజేశారు.

కడపలోవలె కరీంనగర్, విజయనగరంలో ప్రాంతీయ వర్క్‌షాపులను ఒక్కొక్కటి 85లక్షలతో నిర్మించనున్నట్టు ఆయన చెప్పారు.

1977–78 జూలై వరకు కార్పొరేషన్‌కు 33-31కోట్లు ఆదాయం లభించిందని, క్రితం సంవత్సరం ఇదేకాలంలో పోలిస్తే ఇది 24 శాతం ఎక్కువఅని శ్రీ ప్రభాకరరావు చెప్పారు. కట్టుదిట్టాలు చేయడంవల్ల ఇది సాధ్యమైందని, బస్సుల సంఖ్యాక్రితం ఏడాది కంటే 10.2 శాతం పెరగడం గమనార్హమని ఆయన వివరించారు.

విడిదాగాల కొనుగోలులో రాష్ట్రంలోని వర్క్‌షాపులకే ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతున్నదని, 74-75లో స్థానిక కొనుగోళ్ళు 76 లక్షల రూపాయలవరకు వుండగా, 76-77నాటికి 180 లక్షలకు పెరిగిందని వచ్చే ఏడాదికి 250 లక్షలకు పెరుగుతుందని శ్రీ ప్రభాకరరావుచెప్పారు. ఆర్.టి.సి. ఏటా విడిదాగాల కొనుగోలుకు మొత్తం ఏడు కోట్లు ఖర్చు చేస్తుంది.

రాష్ట్రంలో ఆరోగ్యానికి తలసరి వ్యయం

సాలీనా 7.85 రూపాయలు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఆగస్టు 8—ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యానికి తలసరి వ్యయం జాతీయ సగటు కంటే తక్కువేనని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ రాజ్‌నారాయణ్ రాజ్యసభలో వెల్లడించిన లెక్కలవల్ల తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రతి వ్యక్తికి సంవత్సరానికి 7.85 రూపాయలు ఖర్చుచేస్తున్నదని, కాగా, జాతీయ సగటు 9.41 రూపాయలు. నాగాలాండ్‌లో ఆరోగ్యానికి తలసరి వ్యయం అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువ. అంటే 80.84 రూపాయలని. పుదుచ్చేరి 38-84 రూపాయల వ్యయంతో ద్వితీయ స్థానాన్ని ఆక్రమించినట్టు, 35.20 రూపాయల తలసరి వ్యయంతో గోవా తృతీయ స్థానాన్ని సంపాదించినట్టు ఆ లెక్కలవల్ల తెలియవచ్చింది.

అతి తక్కువ తలసరి వ్యయం బీహార్‌లో అంటే 4.09 రూపాయలు, తరువాత ఉత్తరప్రదేశ్‌లో 5.08 శాతం రూపాయలు ఖర్చుగుతుంది.

ఆర్మీ రిక్రూట్స్‌లో ఆంధ్రప్రదేశ్ శాతం

ఆర్మీ రిక్రూట్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 1969-70లో నాలుగు శాతం వుండగా 1976-77 లో అది 3.4 శాతంకు తగ్గింది.

పంజాబ్ శాతం కూడా 16.3 నుంచి 14 3కు తగ్గింది. హర్యానా వాటా 3.9 నుంచి తొమ్మిది శాతానికి, హిమాచల్ ప్రదేశ్ 4.6 నుంచి 5.7 శాతానికి, ఉత్తర ప్రదేశ్ 15.1 నుంచి 17.7 శాతానికి, కేరళ 5.5 నుంచి 5.8 శాతానికి పెరిగింది. తమిళనాడు, బీహార్‌లలో రిక్రూట్స్ శాతం కొద్దిగా తగ్గినట్టు రికార్డు అయింది.

మోడీనగర్ వద్ద రైలు ప్రమాదం

[illegible] మందికి గాయాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8— ఇక్కడకు వస్తున్న ఢిల్లీ-అంబాలా ప్యాసింజర్ రైలు ఇంజను, నాలుగు పెట్టెలు ఇక్కడకు సుమారు 44 కిలోమీటర్ల దూరంలోవున్న మోడీనగర్‌వద్ద మొన్న మధ్యాహ్నం 1-10 గంటలకు పట్టాలుతప్పినందున ఇద్దరు చనిపోయారు. మరి 42 మంది గాయపడినట్టు ఉత్తర రైల్వే వర్గాలు తెలియజేశాయి.

గాయపడిన వారిలో 26 మందిని మోడీనగర్, మీరట్‌లలోని ఆస్పత్రులలో చేర్చారు. వారిలో ఎనిమిదిమందికి తీవ్రమైన గాయాలు తగిలాయి.

జీడిమెట్ల పారిశ్రామిక వాడలో స్టేట్ బ్యాంకుశాఖ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— జీడిమెట్ల పారిశ్రామిక వాడలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను శ్రీ పి.సీతాపతి ఇటీవల ప్రారంభోత్సవం చేశారు.

పారిశ్రామిక వాడ నడిబొడ్డులో ఈ బ్యాంకి శాఖను ప్రారంభించినందుకు ఆయన తమ అభినందనలను తెలిపారు.

ప్రస్తుతం అక్కడ పారిశ్రామిక వేత్తలకు ఎటువంటి బ్యాంకింగ్ సౌకర్యాలు లేవని, వారి అవసరాలను ఈ బ్యాంకి తీర్చగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

తొలుత బ్యాంకి ప్రాంతీయ మేనేజరు శ్రీ బి. ఎస్. సుబ్రహ్మణ్యం అతిథులకు స్వాగతం పలికారు.

రాష్ట్రంలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8 — ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 15 వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈ కింది విధంగా జరుగుతాయి.

సికిందరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం తొమ్మిది గంటలకు జరిగే ఉత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సైన్యం, పోలీసు, ఫైర్ బ్రిగేడ్ స్కౌట్స్, ఎన్.సి.సి. విద్యార్థుల మొదలగువారి నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.

జిల్లా ప్రధాన కేంద్రాలలో ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించి, పోలీసు వందనాన్ని స్వీకరిస్తారు.

ఇతర ప్రదేశాలలో హైస్కూల్స్‌లో ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తారు. జాతీయ గీతాలను ఆలపిస్తారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెడతారు.

దర్గామిట్టలో జిల్లా పరిషత్ హైస్కూలుకు ప్రారంభోత్సవం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నెల్లూరు, ఆగస్టు 8— దర్గామిట్టలో కొత్తగా నిర్మించిన శిశు సంక్షేమ గృహంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీ పి. వి. రంగారెడ్డి ఇటీవల ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా శ్రీ రంగారెడ్డి ప్రసంగిస్తూ విద్య ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి పాఠశాల ఒక దేవాలయమని ఆయన అభివర్ణించారు. దాతలను ఆయన అభినందించారు.

కార్యక్రమానికి శ్రీ డి. శేషారెడ్డి అధ్యక్షత వహించారు.

జిల్లా కలెక్టర్ శ్రీ అర్జునరావు ప్రసంగిస్తూ, పాఠశాల ప్రారంభోత్సవంలో జిల్లా పరిషత్ వాంఛ నెరవేరిందని అన్నారు. భవన నిర్మాణానికి యాభైవేల రూపాయలు విరాళమిచ్చినందుకు శ్రీ శేషారెడ్డిని ఆయన అభినందించారు. కొత్త భవన నిర్మాణానికి రాష్ట్ర గవర్నర్ శంకుస్థాపన చేస్తారని ఆయన అన్నారు.

శాసనమండలి సభ్యుడు శ్రీ ఆనం సంజీవరెడ్డి, శ్రీ ఎం గోపాలకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ సి. ఎస్. వి. సుబ్బారెడ్డి ప్రసంగించారు.

తొలుత జిల్లాపరిషత్ కార్యదర్శి శ్రీ కె. సూర్యనారాయణ స్వాగతం చెప్పారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ రాధాకృష్ణారెడ్డి వందనసమర్పణచేశారు.

"శుశ్రుతసంహితలోని ప్రాచీన శస్త్రచికిత్సా పద్ధతులు

వరంగల్ సభలో ప్రొఫెసర్ దేశ్‌పాండే వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

వరంగల్లు, ఆగస్టు 8— బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం మెడికల్ సైన్సుల ఇన్‌స్టిట్యూట్ శల్యశాస్త్రశాఖాధిపతి ప్రొఫెసర్ పి.జె. దేశ్‌పాండే ఇక్కడ గవర్నమెంటు కాలేజీలో శుశ్రుత సంహితలోని ప్రాచీన శస్త్ర చికిత్సా పద్ధతులు గురించి ప్రదర్శనాత్మకంగా ఉపన్యసించారు. క్రీస్తుకు పూర్వం మూడు వేల సంవత్సరాలనాడు ఈ ప్రాచీన శస్త్ర చికిత్సా పద్ధతులు వాడుకలో వున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సభలో ప్రొఫెసర్ దేశ్‌పాండే అత్యంత ప్రాచీనమైన శస్త్ర చికిత్సా పద్ధతులకు సంబంధించిన కొన్ని స్లయిడ్లను 45 నిమిషాలపాటు ప్రదర్శించారు.

సభకు కాకతీయ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పున్నంచంద్ సిందోవా అధ్యక్షత వహించారు. తొలుత కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కామరాజు కృష్ణమూర్తి వక్త ప్రొఫెసర్ దేశ్‌పాండేను సభికులకు పరిచయం చేశారు.

డాక్టర్ శ్యామ్‌సుందర్ వందన సమర్పణ చేశారు.

జనతా అసోసియేట్ సభ్యులుగా ఎం.పి. లను చేర్చుకునే అవకాశం

—పార్టీ నిబంధనావళిలో మార్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 8— జనతా పార్టీ సభ్యులు కాని ఎం.పి. లను పార్టీలోఅసోసియేట్ సభ్యులుగా చేర్చుకొనడానికి జనతా పార్లమెంటరీ పార్టీ నియమావళిలో అవకాశం కల్పించారు.

జనతా పార్టీలో చేరదలచిన ఎం. పి. లను, పార్లమెంటరీ పార్టీ కార్యవర్గం సిఫార్సు చేసిన తరువాత పార్టీలో అసోసియేట్ సభ్యులుగా చేర్చుకొంటారు. జనతా పార్లమెంటరీ పార్టీ నియమావళిని నిన్న జరిగిన పార్లమెంటరీ పార్టీ సర్వసభ్య సమావేశం ఆమోదించింది.

జనతా పార్టీ సిద్ధాంతాలను, కార్యక్రమాన్ని ఆమోదించిన ఎం.పి.లనే చేర్చుకొనాలని పార్లమెంటరీ పార్టీ కార్యవర్గం సిఫార్సు చేసింది. కాని పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఈ నిబంధనను సర్వసభ్య సమావేశం తొలగించింది.

రెండు రోజుల సమావేశం తరువాత పార్లమెంటరీ పార్టీ సర్వసభ్య సమావేశం పార్టీ నియమావళిని ఆమోదించింది.

జనతా పార్లమెంటరీ పార్టీ నాయకుడిపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై రహస్య ఓటింగ్ జరిగినప్పుడు, పార్టీ మొత్తం సంఖ్యలో సగం మందికిపైగా సభ్యులు అనుకూలంగా ఓటు చేసినప్పుడు ఆ తీర్మానం ఆమోదింపబడినట్లు భావించాలని నియమావళిలో పేర్కొన్నారు.

విప్ జారీ అయినపుడు ఏ సభ్యుడు కూడా ముందుగా చీఫ్‌విప్ అనుమతి కాని, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి అనుమతి కాని పొందకుండా గైరుహాజరు కావడానికి వీలులేదని నియమావళిలో స్పష్టం చేశారు.

ప్రపంచ మలయాళం సమావేశాలకు రాష్ట్రపతి ప్రారంభోత్సవం

వచ్చే నవంబరులో

త్రివేంద్రం, ఆగస్టు 8— కేరళ విశ్వవిద్యాలయం, రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో వచ్చే నవంబరులో ఇక్కడ జరిగే ప్రపంచ మలయాళం సమావేశాలకు ప్రారంభోత్సవం చేయడానికి రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి సమ్మతించారు.

మొన్న ఢిల్లీనుంచి ఇక్కడికితిరిగివచ్చిన ముఖ్యమంత్రి శ్రీ ఎ. కె. ఆంటోని ఈ విషయాన్ని తెలిపారు.

రాష్ట్రాన్ని సందర్శించడానికి ప్రధాన మంత్రి కూడా సమ్మతించినట్టు ఆయన పత్రికా విలేకరులకు చెప్పారు. అయితే, ఇంకా తేదీ నిర్ణయం కాలేదని, బహుశా రాష్ట్రపతి సందర్శనకు ముందే ప్రధాని పర్యటన జరగవచ్చునని తెలుస్తున్నది.

శ్రీ విశాఖ గ్రామీణ బ్యాంకి 24 వ శాఖను విశాఖజిల్లా తాళ్ళపాలెంలో ప్రారంభించిన సందర్భంలో ముఖ్యఅతిథి కేప్టెన్ ఎస్. కె. సోమయాజులు (మేనేజింగ్ డైరెక్టర్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రసంగిస్తున్న దృశ్యం. వారిప్రక్కన బ్యాంకి చైర్మన్ పట్నాయక్‌నుకూడా చూడవచ్చు

హోమియో కాలేజీలపట్ల ప్రభుత్వం అలక్ష్యం: సంఘం అధ్యక్షుని ఆరోపణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— రాష్ట్రంలోని మూడు హోమియో కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అయిదేళ్ళు గడిచినప్పటికి, వాటి అభివృద్ధికి ఏమాత్రం కృషి జరగకపోవడంవల్ల భారతహోమియో వైద్యసంఘం రాష్ట్రశాఖఅధ్యక్షుడుడాక్టర్ ఎన్. రామయ్య విచారం వ్యక్తం చేశారు.

డాక్టర్ రామయ్య మొన్న ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం వందమంది హోమియో డిప్లొమా పొందుతున్నారని- వారికి ఉద్యోగావకాశాలను కల్పించాలని, ఎక్కువ సంఖ్యలో హోమియో వైద్యశాలలను ప్రారంభించి, నిరుద్యోగ సమస్యను తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ఆరోగ్య మంత్రి ఎప్పటికప్పుడు వాగ్దానాలు చేస్తూ- వాటిని అమలుజరపకుండా వున్నారని ఆయనఅన్నారు. హోమియోపతికి తగిన ప్రతిపత్తి కల్పించి, ప్రజలకు అందుబాటులో వుండే విధంగా ప్రోత్సహించాలని ఆయన కోరారు. బయోలాజికల్ సైన్స్ చదివిన విద్యార్థులు కూడా హోమియోపతి కోర్సులో చేరవచ్చని ప్రభుత్వం ఇటీవల జారీచేసిన ఉత్తర్వు విస్మయం కలిగిస్తున్నదని ఆయన అన్నారు.

వచ్చే అక్టోబర్ నెలలో ఢిల్లీలో అంతర్జాతీయ హోమియో వైద్య సమావేశం జరుగుతుందని, 1978 జనవరిలో అఖిలభారత హోమియో వైద్యసమావేశం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

భారత హోమియో వైద్య సంఘం కేంద్ర నిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎన్. కృష్ణారావు. హోమియో విద్యార్థుల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లా. తాలూకా, బ్లాకు స్థాయిలలో హోమియో డిస్పెన్సరీలను ప్రారంభించాలని. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హోమియోపతి పాకల్టీ ప్రారంభించాలని కోరుతూ నగరంలోని జె సూర్య, పొట్టి శ్రీరాములు హోమియో కళాశాలల విద్యార్థులు నిన్నటి నుంచి రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు.

విద్యార్థులు శిక్షణ పొందడానికి వసతుల సంఖ్యను 250 వరకు పెంచాలని, ఇతరులతోపాటు స్టయిపెండ్ ఇవ్వాలని వారు కోరుతున్నారు. హోమియోపతి వైద్య విద్యార్థుల కార్యాచరణ సంఘం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది.

ఆలమూరులో ఎలుకల నివారణకు చర్యలు

అలమూరు, ఆగస్టు 8 — ఆలమూరు తాలూకాలోని గ్రామాలలో ఎలుకలు పరిపైరుకు విశేష నష్టం కలిగిస్తున్నది

ఈ విషయాన్ని పురస్కరించుకుని ఆలమూరు సహాయ వ్యవసాయాధికారి ఒక సభకాన్ని ప్రవేశ పెట్టారు.

క్రిమిసంహారక మందు జెమిక్రాన్ ఒక మిల్లీమీటరును ఒక లీటరు నీళ్లలో కలిపి ఆ నీటికి సరిపడు అటుకులను కాని ధాన్యాన్ని కాని నానబోసి అనంతరం వాటిని పొలాల గట్లపై చల్లిన వాటిని ఎలుకలు తిని చనిపోగలవని ఆయన రైతులకు సూచించారు.

కొలగారం సమస్య పరిష్కారంకుదరనిస్థితి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

విజయవగరం, ఆగస్టు 8—కొలగారం విషయంలో స్థానిక వ్యాపారస్తులు, మార్కెట్ కార్మికులమధ్య వచ్చిన వివాదం ఇంతవరకు పరిష్కారం కాలేదని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు శ్రీ గోకవరపు రామలింగయ్య ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజన్న కవికి సన్మానం

కమలాపురం, ఆగస్టు 8— "రాయలయుగంలో సంగీత సాహిత్యాలు" అన్న విషయంపై శ్రీ రాజన్న కవి ఇక్కడ ప్రసంగించారు.

సభకు స్థానిక హెడ్మాస్టరు శ్రీ వై.వి కొండన్న అధ్యక్షత వహించారు. శ్రీ ఎం. సుబ్బన్న ముఖ్య అతిథిని పరిచయంచేశారు

గ్రామ సర్పంచ్ శ్రీ జి.వి. సుబ్బారెడ్డి శ్రీ రాజన్న కవిని సన్మానించారు.

ఆంధ్ర యూనివర్సిటీ ఉద్యోగుల కోర్కెల దినం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విశాఖపట్నం, ఆగస్టు 8—అఖిలభారత యూనివర్సిటీ ఉద్యోగుల సమాఖ్య ఆదేశాల మేరకు హాస్టల్ వర్కర్స్ యూనియన్‌తో కలసి ఆంధ్ర యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ "కోర్కెల దినం" పాటించింది.

విద్యా సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు ట్రేడ్ యూనియన్ హక్కులు పునరుద్ధరించాలని యూనివర్సిటీ పరిపాలనలో ప్రజాస్వామ్యపద్ధతులను ప్రవేశపెట్టాలని, యూనివర్సిటీలకు స్వతంత్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని, ఆత్యయిక స్థితిఅమలులో వున్నకాలంలో తొలగించబడిన ఉద్యోగులను తిరిగి చేర్చుకోవాలని కోరుతూకొన్ని తీర్మానాలు చేశారు.

ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శుల నాయకత్వాన కాలేజ నుంచి ఒక ఊరేగింపు బయలుదేరి యూనివర్సిటి ఆవరణ అంతా తిరిగారు.

మిర్యాలగూడలో కుళాయిల దుస్థితి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

మిర్యాలగూడ, ఆగస్టు 8 — అన్ని రంగాలలో మిర్యాలగూడ పట్టణం భారీ యెత్తున అభివృద్ధిని సాధించింది. గత సంవత్సరమే పట్టణ ప్రజలకు ప్రభుత్వం మంచినీటి కుళాయిల సౌకర్యంకల్పించింది. ప్రజల కోసం దాదాపు యాభై కుళాయిలను ప్రభుత్వం నిర్మించింది. మరి వెయ్యిదాకా ప్రయివేట్ కుళాయిలు ఇక్కడ వుంటాయి. ప్రెషర్‌లేక కొన్నికుళాయిలకు గత ఐదు మాసాలు నుంచి సరిగా నీరు సప్లయి కావడంలేదు. వందల రూపాయలు ఖర్చుపెట్టి కుళాయిలను నిర్మించుకుంటే కుళాయిల నుంచి నీరు రాకపోవడంవల్ల గృహిణులు ఇబ్బంది పడుతున్నారు.

నాగార్జునసాగర్ జలాలతో సస్యశ్యామలమయి పుష్కలంగా ఈ ప్రాంతంలో నీరు వున్నప్పటికి పట్టణంలోని కుళాయిలకు ఉదయం నాలుగు గంటలు. సాయంత్రం మూడు గంటలు మాత్రమే నీరు వదలడం జరుగుతున్నది. అలా కాకుండా 12 గంటల పాటు కుళాయిలకు నీరు వదలాలని రిజర్వాయర్ శక్తిని పెంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

విడుదలధర

మద్రాసు మార్కెట్ ధరలు

మద్రాసు, ఆగస్టు 8—

నువ్వుల నూనె క్వింటాలు	825,00
ఆముదం విడిగా క్వింటాలు	151,00
కొబ్బరినూనె టిన్ను 16.065కిలోలు	191,00
వేరుసెనగ పిండి రెడీ	105,00
వేరుసెనగ నూనె	980,00
వేరుసెనగ పప్పు	380,00

జంటనగరాలలో ధరవరలు

హైదరాబాద్, ఆగస్టు 8— జంటనగరాలలోని చిల్లర ధాన్యం, కిరాణా వర్తకుల సంఘం వారి నేటి టోకు ధరలివి (క్వింటాళ్ళలో)

బియ్యం: మసూరి: 210-220, అక్కులు: 175-180, హంసలు: 175-185.

జొన్నలు: తెల్లవి: 145-155 పచ్చవి: 180, హైబ్రిడ్, 110.

గోధుమలు: సర్పత్తి: 160-00 బన్సీలు 165-175

కందిపప్పు: 390-400, మినపప్పు: 380-390, పెసరపప్పు: 300-310, శనగపప్పు: 210, బెల్లం: 210-00, మిర్చి: 700, వేరుశనగపప్పు: 520, చింతపండు: 625 మిర్చి 700-00

వెండి, బంగారం ధరలు

హైదరాబాద్, ఆగస్టు 8— బంగారం కొనుగోలు ధర: 694-00, అమ్మకం ధర: 698-00.

వెండి (కిలోగ్రాం) కొనుగోలు ధర: 1200-00, అమ్మకం ధర: 1210-00.

విశాఖపట్నంలో మంచినీటి కొరత

జిల్లా జనతాపార్టీ అధ్యక్షుని విజ్ఞప్తి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిది)

విశాఖపట్నం, ఆగస్టు 8— విశాఖపట్నంలో అన్నిప్రాంతాల వారికి మంచినీటి సరఫరా జరగడానికి వీలుగా రిజర్వాయర్లు నిర్మించాలని విశాఖజిల్లా జనతాపార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్. ఎస్. ఎన్. రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇందుకు కొన్ని పథకాలను లోగడే రూపొందించడం జరిగిందని. అయితే నిధులు లేక అప్పుడు వాటిని చేపట్టలేదని, ఇప్పుడు తగు నిధులు కలవుకాబట్టి వాటిని చేపట్టాలని ఆయన కోరారు.

మెరక ప్రాంతాలైన వెంకటేశ్వర్లు మెట్టు, శ్రీకృష్ణనగర్, ఎ.వి.ఎన్. కాలేజీ, చెంగల్రావుపేట, భుజంగరావుపేట వంటి ప్రాంతాలకు ఈనాటికి మంచినీరు అందడంలేదని శ్రీ రెడ్డి పేర్కొన్నారు.

ఈ ఇబ్బందులను తొలగించడానికి ఎ.వి.ఎన్.కాలేజీ ప్రాంతంలోను, శ్రీకృష్ణనగర్ ప్రాంతంలోను వెంటనే రిజర్వాయర్లు నిర్మించాలని ఆయన సూచించారు.

కంచెర్లపాలెం, మర్రిపాలెం, బుచ్చిరాజుపాలెం, మధిర ధర ప్రాంతాలను 15 సంవత్సరాల క్రితమే మున్సిపాలిటీలో కలిపినప్పటికీ, ఆ ప్రాంతాలలో మంచినీటి గొట్టాలు లేకపోవడం ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు.

గిద్దలూరు తాలూకా గ్రామంలో హరిజనుల ఇళ్ళపై భూస్వాముల దాడి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

గిద్దలూరు, ఆగస్టు 8— గిద్దలూరు తాలూకా సలకలవీడుగ్రామంలో ప్రభుత్వం భూసంపాదన చట్టం క్రింద నేకరించిన ఎ-3-57 భూమిలో 44 మంది హరిజనులకు పట్టాలివ్వగా. 13 మంది మాత్రం పూరిళ్ళను నిర్మించుకున్నారు. భూకామందులు హైకోర్టు నుంచి స్టే వచ్చిందన్న నెపంతో మంది మార్పులంతో ట్రాక్టరు తీసుకొని దౌర్జన్యంగా కొట్టములను పడగొట్టి ఇండ్ల ప్లాట్లకు వేసిన రాళ్ళను పడగొట్టి నేలమట్టం చేశారు. పోలీసు వారు నేరస్తులను అరెస్టు చేసి రిమాండు యిచ్చారు. జిల్లా కలెక్టరు శ్రీ ఆర్.వి. వైద్యనాథఅయ్యర్, ఆర్.డి.ఓ. శ్రీ అజీజ్, తహశీలుదారు శ్రీ సత్యమూర్తి, పోలీసు సూపరింటెండెంటు శ్రీ సంపత్‌కుమార్‌లు గ్రామాన్ని తనిఖీ చేశారు. బాధితులకు విడి విడిగా 500 రూపాయల పంపిణీ చేశారు. పోలీసు వారు శాంతి భద్రతలను నెలకొల్పుటకు తగు చర్యలు గైకొన్నారు.

బ్యాంకి ఉద్యోగుల ప్రదర్శన

ఆంధ్రప్రదేశ్ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ హైదరాబాదు వారి పిలుపునకు సరించి ప్రకాశంజిల్లా కోవరేటివు సెంట్రలు బ్యాంకు. గిద్దలూరు బ్రాంచి, ఉద్యోగులు, సహకార వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు ఉద్యోగులు బోనసుసమస్యపై తాత్కాలిక భృతి మొదలగు నినాదాలతో ప్రదర్శన జరిపారు.

కాకతీయ యూనివర్సిటీకి అదనపు పోస్టులు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిది)

వరంగలు ఆగస్టు 8— కాకతీయ యూనివర్సిటీని యు. జి. సి. సహాయం పొందడానికి తగునిధంగా రూపొందించడానికి ఆ యూనివర్సిటీకి ఎనిమిది రీడర్ పోస్టులను, ఎనిమిది లెక్చరర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది

మాతృమెటిక్సు డిపార్టుమెంట్‌కు చెందిన శ్రీ ఎ ఎం. ఎల్. రంగారావు ప్రొమోషన్‌పై ఉస్మానియా యూనివర్సిటీకి వెళుతున్న సందర్భంలో ఆయన గౌరవార్థం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ప్రసంగిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె వెంకటరామయ్య ఈ విషయం చెప్పారు.

యూనివర్సిటీ సీనియర్ అధ్యాపకులు జూనియర్స్‌ను ప్రోత్సహించాలని వారిలోని ప్రతిభను వెలికి తీయాలని ఆయన ఉద్బోధించారు.

ఒక యూనివర్సిటీని జాతీయ స్థాయికి తీసుకు వెళ్ళడం, ఆ యూనివర్సిటీ అధ్యాపకులపై ఆధారపడి వుంటుందని ప్రొఫెసర్ వెంకటరామయ్య అన్నారు.

సభలో ప్రొఫెసర్ ఎస్. పి. విజయ సారథి. డాక్టర్ బి కేశవరావు డాక్టరు భాస్కరరావు ప్రభృతులు ప్రసంగించారు.

డాక్టర్ ఎం.ఎల్. రంగారావు జరిగిన సన్మానానికి ఉచిత రీతిన సమాధానం చెప్పారు.

కొత్తపేట జూనియర్ అధ్యాపకుల బదిలీ

కొత్తపేట, ఆగస్టు 8— కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలనుంచి బదిలీ అయిన సందర్భంలో శ్రీమతి జి. ఎ. నేరురాణి, శ్రీ కలగా వెంకటసుబ్బారావు, శ్రీ వి. మురళీమోహన్, శ్రీ బందా సుబ్బారావులకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఐ. వి. సుబ్బరాజు ఆధ్వర్యంలో వీడ్కోలుసభ జరిగింది.

ఉపాధ్యాయుడు శ్రీ సామవేదం సోమనాథశాస్త్రి ప్రసంగించారు.

అణు విజ్ఞాన రంగంలో ఇండియా పై ఒత్తిడి

—కాంగ్రెసు కార్యవర్గం విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 8—అణు విజ్ఞానంలో స్వయం సమృద్ధిని సాధించడం, శాంతియుత ప్రయోజనాలకు అణు పరీక్షలను జరపాలనే నిర్ణీత పంథాను ఇండియా విడనాడేట్టు చేయడానికి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంపై బయటినుంచి వత్తిడి వస్తున్నదని కాంగ్రెసు కార్యవర్గం నిన్న ఒక తీర్మానంలో వివరించింది.

దేశంలో పాస్ట్ బ్రీడర్ కార్యక్రమాన్ని, రీ-ప్రాసెసింగ్ సౌకర్యాల ఏర్పాటు కార్యక్రమాన్ని మందకొడిగా సాగించాలనీ బయటి నుంచి వత్తిడి రాగలదని కూడా కాంగ్రెసు కార్యవర్గం ఆందోళన వ్యక్తం చేసింది.

బయటివారి ఒత్తిడికి లొంగలేదని జనతా ప్రభుత్వం ఇంతవరక

6 శాతం ఆంధ్ర,వదేశ్ రాష్ట్ర అభివృద్ధిరుణం 1987

జారీ ధర: రు. 99.50 శాతం

ప్రారంభం 23 ఆగస్టు 1977

దాదాపు రు. 20.5 కోట్లు అందగానే ఎట్టి నోటీసు లేకుండా రుణ నేకరణ ముగించబడుతుంది. అయితే ఎట్టి పరిస్థితిలోను 1977 ఆగస్టు 25 వ తేదీ వ్యాపార వేళల ముగింపు తర్వాత స్వీకరించబడదు.

సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిజర్వు బ్యాంకు బ్రాంచీలలోను. జిల్లా కలెక్టరు కార్యాలయాలలోను. ట్రెజరీ. సబ్ ట్రెజరీ కార్యాలయాలలోను పూర్తి వివరాలు పొందవచ్చు.

రు. 100000/- బహుమతి

వెంకటేశ్వర గ్రూపు

ఆగండి!!

31 ఆగస్టు 1977 న మా వెంకటేశ్వర గ్రూపు కొరకు రు. 100000/-ల ఒక బంపర్ బహుమతి ప్రకటించబడుతుంది.

10వ డ్రా కరీంనగర్ వద్ద జరుపబడుతుంది.

మీరు ఒకటి/రెండు లేదా తొమ్మిది వాయిదాల వరకు చెల్లింపులు బాకీ ఉన్నయెడల రు. 1,00,000/-అదనపు ప్రత్యేక బంపర్ బహుమతి మరియు ఇతర బహుమతులు గెలుపొందుట కొరకు ఆలస్యం రుసుం లేకుండా మీ సమీప గుజరాత్ సేవింగ్స్ శాఖ లేదా ఆంధ్రా బ్యాంకు లి మి టెడ్ ఏ శాఖలోనైనా వెంటనే చెల్లించండి.

మా సభ్యులకు తాత్కాలిక రశీదులు జారీచేయుటకు ఏజెంట్లకు అధికారంలేదు. అందుచేత సభ్యులందరూ వారు తమ మొత్తాలు వారి ఏజెంట్లకు చెల్లించినచో మా అధికార పూర్వకమైన రశీదు తీసుకోవలసినదిగా కోరబడుచున్నారు.

గుజరాత్ సేవింగ్స్‌చే వారి సభ్యుల సౌకర్యార్థం జారీ చేయబడింది.

గుజరాత్ సేవింగ్స్

హెచ్. ఓ. 518, కల్బాదేవీరోడ్డు

బొంబాయి-400 002.

ఫోను: 310605 - 310533

ఆంధ్ర మరియు భారతదేశ మంతటా శాఖలు కలవు

భారత ప్రభుత్వం

రవాణా మరియు షిప్పింగ్ మంత్రిత్వశాఖ

డైరెక్టొరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్

"జహాజ్ భవన్", వాల్‌చంద్ హీరాచంద్‌మార్గ్,

బొంబాయి — 400038

వ్యాపార నౌకాదళం 1977లో ఇంజనీర్ ఆఫీసర్లగా శిక్షణ పొందుట కొరకు డైరెక్టర్ ఆఫ్ మెరైన్ ఇంజనీరింగ్ ట్రయినింగ్‌కు ప్రవేశం.

ఈ సంస్థలో నిర్వహించబడే ఒక సంవత్సరం కాలంగల మెరైన్ ఇంజనీరింగు కోర్సులో ప్రవేశమునకు డైరెక్టొరేట్ ఆఫ్ మెరైన్ ఇంజనీరింగ్ ట్రైనింగ్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్లకు 50 సీట్లు కలవు.

సెలెక్షన్: బి.ఇ. డిగ్రీ ఆఖరి సంవత్సరం పరీక్షలో లభించిన మార్కులపై అభ్యర్థుల ఎంపిక వుంటుంది. బి. ఇ. డిగ్రీలో వారికి లభించిన మార్కులపై పేనల్‌లో ఉంచబడిన అభ్యర్థులు. బొంబాయివద్ద సెలక్షన్‌బోర్డు ఎదుట ఆరోగ్య పరీక్ష మరియు ఇంటర్వ్యూ కొరకు పిలువబడతారు. ఆయా కేంద్రములలో జరుగు పరీక్ష మరియు ఇంటర్వ్యూకు వసతి, భోజనము మరియు ప్రయాణ ఛార్జీలు అభ్యర్థులే భరించాలి.

రిజర్వేషన్: షెడ్యూల్డుకులంకు చెందిన అభ్యర్థులకు 15%. మరియు షెడ్యూల్డు తరగతివారికి 5% సీట్లు సరియైన అభ్యర్థులు లభించే ప్రాతిపదికపై రిజర్వు కాబడినవి.

ప్రవేశమునకు అర్హతలు: హయ్యర్ సెకండరీ విద్య తరువాత 5 సం॥ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ముగింపుపై భారతీయ విశ్వవిద్యాలయాలు / ఐ. ఐ.టి.లు నుండి మెకానికల్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బేచులర్ డిగ్రీ ఆఖరి సంవత్సరం డిగ్రీ పరీక్షకు హాజరయిన అభ్యర్థులు కూడా వారు ఆ పరీక్షను ఉత్తీర్ణులైనట్లు 1-10-77 లోగా దాఖలా పరచే షరతులో హాజరు కావచ్చును.

వయోపరిమితి: అభ్యర్థులు 1-10-77 నాటికి 21 నుండి 24 సం॥ల మధ్య వయస్సు కలిగి వుండాలి. అనగా వారు 2-10-1953 మరియు 1-10-1956 మధ్య జన్మించి వుండాలి: షెడ్యూల్డు కులం మరియు షెడ్యూల్డు తరగతికి చెందిన అభ్యర్థులు 21 నుండి 25 సం॥ల మధ్య వయస్సు కలిగి వుండాలి. అనగా 2-10-1952 మరియు 1-10-1956ల మధ్య జన్మించి వుండాలి.

శిక్షణ దరఖాస్తు/వివరములు: మెరైన్ ఇంజనీరింగు కోర్సు వివరాలు కలిగే క్లుప్తమైన పత్రాలు మరియు ఫీజులు. ఉపకార వేతనములు మొదలగు వివరాలు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ట్రెయినింగ్), డైరెక్టొరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్, జహాజ్ భవన్, వాల్ చంద్ హీరాచంద్ మార్గ్, బొంబాయి—400 038 వారి నుండి డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్, బొంబాయి వారి పేర బొంబాయి. జి.పి.ఓ వద్ద చెల్లింపబడునట్లు రు 2/- లకు క్రాసు చేయబడిన ఇండియన్ పోస్టల్ ఆర్డరు చెల్లించి పొందవచ్చును. దరఖాస్తు ఫారంలు మొదలగునవి పొందుటకు ఆసక్తిగల అభ్యర్థులు స్వంత చిరునామా గల 23 సెం.మీ × 10 సెం.మీ సైజు కవరుపై 40 పైసల స్టాంపులు అంటించి వ్రాతపూర్వకంగా ఉన్న దరఖాస్తుతో దాఖలు చేయాలి. దరఖాస్తులోను మరియు స్వంత చిరునామాగల కవరుపైన పెద్ద అక్షరాలలో పూర్తి పోస్టల్ చిరునామా వ్రాయాలి. దరఖాస్తు ఫారం పరపరాకు అభ్యర్థన గల కవరు పై ప్రక్క ఎడమ భాగమున "రిక్వెస్టు ఫర్ డైరెక్టొరేట్ ఆఫ్ మెరైన్ ఇంజనీరింగు ట్రైనింగ్ అప్లికేషన్ ఫారం" అను అక్షరాలు కలిగి ఉండాలి.

ముగింపు తేదీ: పురుష అభ్యర్థుల నుండి నిర్ణీతమైన ఫారములో అన్ని విధాల పూర్తిచేయబడిన దరఖాస్తులు ఎగ్జిక్యూటివ్. ఆఫీసర్ (ట్రైనింగ్), డైరెక్టొరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్, జహాజ్ భవన్, వాల్‌చంద్ హీరాచంద్ మార్గ్, బొంబాయి—400 038 వారికి 30, సెప్టెంబర్ 1977 లోగా చేరునట్లు పంపాలి. నిర్ణీత గడువు తరవాత తీసుకోబడిన దరఖాస్తులు గుర్తించబడవు భాగ్రీ దరఖాస్తు ఫారముల పరపరా 23 సెప్టెంబర్ 1977తో ముగించబడుతుంది.

davp 700 (32) 77

అందరిని అలరించే సినీ వార పత్రిక **జ్యోతిచిత్ర** వారంవారం చదవండి

Printed and Published by K.L.N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-520010. Editor: Nanduri Ramamohana Rao

లాన్స్‌షైర్ జట్టు వికెట్ నష్టపోకుండా 7 పరుగులు

251 కి ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్ డిక్లేర్

మాంచెస్టర్ (ఇంగ్లండ్) ఆగస్టు 8— లాన్స్‌షైర్-ఆస్ట్రేలియా జట్లమధ్య ఇక్కడ జరుగుతున్న మూడురోజుల క్రికెట్ మ్యాచ్‌లో నిన్న రెండవరోజు ఆట ముగిసే సమయానికి లాన్స్‌షైర్ జట్టు రెండవఇన్నింగ్స్‌లో వికెట్ కూడా నష్టపోకుండా ఏడు పరుగులు చేసింది. వెలుతురు సరిగా లేనందువల్ల ఆటను నిర్ణీత సమయానికి 45 నిమిషాలు ముందుగానే నిలిపివేశారు. అంతకుముందు ఆస్ట్రేలియా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. లాన్స్‌షైర్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 215 పరుగులు చేసింది.

ఆస్ట్రేలియాతో నాల్గవ టెస్ట్‌లో పాల్గొనే ఇంగ్లండ్ జట్టు

లండన్, ఆగస్టు 8—వచ్చే 11 వ తేదీ గురువారం నుంచి లీడ్స్‌లో, ఆస్ట్రేలియా జట్టుతో జరగనున్న నాల్గవ క్రికెట్ టెస్ట్‌లో పాల్గొనే ఇంగ్లండ్ జట్టు సభ్యుల పేర్లను నిన్న ఇక్కడ ప్రకటించారు. నాటింగ్‌హామ్‌లో మూడవ టెస్టులో విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు యథావిధిగా నాలుగవ టెస్టులో పాల్గొనబోతున్నది. జట్టులో మార్పులు లేవు.

నిన్న ఇక్కడ వెలువడిన ప్రకటన ప్రకారం మైక్ బ్రియర్లీ ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. జట్టులో ఇంకా జెఫ్‌బాయ్ కాట్, రాబర్ట్ పుల్మర్, డెరిక్ రాండాల్, జెఫ్ కూప్, టోనీగ్రెగ్, ఐబోథమ్, మిల్లర్, ఆలన్‌నాట్, డెరిక్ అండర్‌వుడ్, జాన్ హెంట్రిక్, రాబర్ట్ విల్లిస్ వుంటారు.

చదరంగం పోటీలు

పుదుచ్చేరి, ఆగస్టు 8—నిన్న ఇక్కడ ప్రారంభమయిన తృతీయ దక్షిణమండలం-శ్రీలంక చదరంగం పోటీలలో పాల్గొనే తమిళనాడుజట్టులో జాతీయ ఛాంపియన్లు మేనుల్‌ఆరున్, రాజారవి శేఖర్‌వున్నారు.

పుదుచ్చేరిలో ఇంత బ్రహ్మాండమయిన పోటీలను ఇంతకుముందెన్నడూ నిర్వహించలేదు. మొదటి ఛాంపియన్‌షిప్ పోటీలను మద్రాసులో 1974లో నిర్వహించారు అప్పుడు తమిళనాడుకు ప్రథమస్థానం. ఆంధ్రప్రదేశ్‌కు ద్వితియస్థానంలభించాయి. రెండవ ఛాంపియన్‌షిప్ పోటీలను శ్రీలంకలో 1976లో నిర్వహించగా అప్పుడు కర్ణాటక ప్రథమ స్థానాన్ని, తమిళనాడు ద్వితియస్థానాన్ని గెలుచుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం. డి. హస్సన్ మినహా దక్షిణమండలానికి చెందిన మేటి క్రీడాకారులంతా ఈ పోటీలలో పాల్గొంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు, ఎస్. ఘాలిబ్, కె. ఫరూక్‌అలీ, వి.వి. శాస్త్రి, వి. బాలకృష్ణరావు, సారది ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మహారాజా అథెటిక్ క్లబ్‌పై హీరోస్ క్లబ్ విజయం

నాగాంగ్, ఆగస్టు 8 — ఇక్కడ జరుగుతున్న అఖిల భారత స్వాతంత్ర్య దినోత్సవ ఫుట్‌బాల్ పోటీలో నిన్న 3-2 గోల్స్ తేడాతో మహారాజా అథెటిక్ క్లబ్ (గౌహతి) ని ఓడించి అంబాలాకు చెందిన హీరోస్ క్లబ్ క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించింది.

ఒపెక్ సహాయనిధి రెట్టింపు మేరకు హెచ్చింపు

వియన్నా, ఆగస్టు 8— పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్) ఆర్థిక మంత్రుల సమావేశం మొన్న ఇక్కడ ముగిసింది. ఈ సమావేశం ఆరు గంటలపాటు జరిగింది.

తృతీయ ప్రపంచానికి సహాయం విషయమై నిర్దిష్టమైన కొత్త వాగ్దానాలు చేయడంలో ఇది విఫలమైంది.

అయితే, అభివృద్ధి నిధికి పెట్రోలియం ఎగుమతి దేశాలు ఇచ్చే "ప్రత్యేక నిధి"ని రెట్టింపుచేసే పథకాన్ని ఈ సమావేశం ఆమోదించింది. ఈ నిర్ణయం ప్రకారం సహాయనిధి 80 కోట్ల డాలర్ల నుంచి 160 కోట్ల డాలర్లకు పెరుగుతుంది.

ఈ దేశాల మంత్రులు క్రిందటి ఫిబ్రవరిలో ఇక్కడ సమావేశమై ఈ మేరకు నిర్ణయం గైకొన్నారు.

ఈ నిర్ణయాన్ని ఇప్పుడు ఈ సమావేశం ధ్రువపరచింది.

ఈ నెల 18న రాష్ట్రపతిచే మద్రాసులో శ్రీ కామరాజ్ చిత్రపటం ఆవిష్కరణ

మద్రాసు, ఆగస్టు 8— రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి ఈ నెల 18వ తేదీన తమిళనాడు అసెంబ్లీలో కీర్తిశేషులు కామరాజ్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తారు.

మొన్న విడుదలైన అధికార కార్యక్రమం ప్రకారం శ్రీ రెడ్డి ఈ నెల 17వ తేదీ 10-45 గంటలకు ప్రత్యేక విమానంలో మద్రాసు వస్తాడు. 45 నిమిషాలు విమానాశ్రయంలో కడపిన అనంతరం ఆయన తిరుపతి వెడతారు. ఆ మరునాడు ఉదయం ఆయన మద్రాసు వచ్చి 10-30 గంటలకు అసెంబ్లీహాలులో కామరాజ్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తారు. ఆ రోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో గాంధీజీ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తారు.

19 వ తేదీన శ్రీ రెడ్డి తిరిగి ఢిల్లీ వెడతారు.

అవినీతి నేరారోపణపై పంజాబ్ పి. సి. సి. మాజీ కార్యదర్శి అరెస్టు

చండీఘర్, ఆగస్టు 8— భారత శిక్షాస్మృతిలోని 420, 406 161, 162 సెక్షన్ల క్రింద, అవినీతి నిరోధక చట్టంలోని 52వ సెక్షన్ క్రింద పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి, పంజాబ్ మార్కెటింగ్ మాజీ అధ్యక్షుడు శ్రీ ఓంకార్ చంద్‌ను పంజాబ్‌పోలీసులు పాటియాలాలో అరెస్టుచేశారు.

ఈ కేసు సందర్భంగా శ్రీ జోగిందర్ సింగ్‌ను పాటియాలా వద్ద అరెస్టు చేసినట్టు పోలీసు ప్రతినిధి ఒకరు విలేకరులతో చెప్పారు.

తమ పలుకుబడిని వుపయోగించి భారత ఆహార సంస్థలో తన కుమారుడు జస్వీర్ సింగ్‌కు ఉద్యోగం ఇప్పించడంలో లొద్దడతామని శ్రీ ఓంకార్‌చాంద్, శ్రీ జోగిందర్ సింగ్‌లు 10 వేల రూపాయలు లంచం తీసుకొన్నారని శ్రీ జగదేవ్‌సింగ్ చేసిన ఫిర్యాదుపై ఆ అరెస్టులు చేసినట్టు ఆ ప్రతినిధి చెప్పారు.

గత జనవరిలో జస్వీర్ సింగ్‌కు ఇంటర్వ్యూ కార్డు వచ్చింది. కాని అతనికి ఉద్యోగం రాలేదు. డబ్బు తిరిగి ఇవ్వలేదు. అందుపై శ్రీ జగదేవ్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాల్గు లక్షల విలువగల బన్సీలాల్ కుటుంబం చరాస్తి స్వాధీనం

భివానీలోని శ్రీ బన్సీలాల్ భవనాన్ని 33 గంటలపాటు సోదాచేసిన తరువాత రక్షణశాఖ మాజీ మంత్రి శ్రీ బన్సీలాల్, ఆయన కుమారుడు శ్రీ సురేందర్ సింగ్, ఇతర కుటుంబ సభ్యులకు చెందినదనిచెప్పే సుమారు నాలుగు లక్షలరూపాయల విలువగల చరాస్తిని హరియానా పోలీసులు మొన్న స్వాధీనం చేసుకొన్నారు.

50 వేల రూపాయలు విలువగల బ్యాంకు డిపాజిట్లు వున్నట్టు రుజువుచేసే పత్రాలు, 25 వేల రూపాయల విలువగల ఆభరణాలు, ఒక్కొక్కటి 50 వేల రూపాయలకు మూడు ఇన్సూరెన్స్ పాలసీలు, 15 వేల రూపాయల నగదు, రెండు వందల వరకు కొత్తగా దిగుమతి చేసుకొన్నవి, స్వదేశీ చీరలు, అయిదువేల రూపాయల విలువచేసే విదేశీ సౌందర్యపోషక వస్తువులు స్వాధీనం చేసుకొన్నవాటిలో వున్నట్టు భివానీ సీనియర్ పోలీసుసూపరింటెండెంట్ శ్రీ ఎస్. సేథి తెలియజేశారు.

రెండు ఎయిర్‌కండిషనర్లు, ఒకరేడియోగ్రామ్, ఒక టెలివిజన్ సెట్టు కూడా స్వాధీనం చేసుకొన్నవాటిలో వున్నాయి.

వాటితోపాటు కొన్ని పత్రాలను కూడా స్వాధీనం చేసుకొన్నామని. అవి పరిశీలనలో వున్నాయని శ్రీ సేథీ చెప్పారు.

శ్రీ బన్సీలాల్ కుటుంబానికి చెందిన స్థిరాస్తి విలువ అంచనా వేయడానికి ఒకటి, రెండు రోజులు పడుతుందన్నారు.

హరిజనులపై అత్యాచారాలపట్ల నిరసన మహాసభ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— హరిజన, గిరిజన తదితర వెనుకబడిన తరగతులపై జరుగుతున్న అత్యాచారాల పట్ల నిరసనగా, వారి హక్కుల పరిరక్షణకై వచ్చేనెల నాల్గవ లేదిన రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఇక్కడ ఏర్పాటుచేయనున్నట్టు భారత కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర శాఖ మొన్న ఒక ప్రకటన చేసింది.

సమావేశం వివరాలను త్వరలో ప్రకటిస్తారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ, రాష్ట్ర ఫిషర్ మెన్ యూనియన్ అధ్యక్షుడు శ్రీ వంకా సత్యనారాయణ, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు శ్రీ వై. వి. కృష్ణారావు తదితరులు చేసిన ఆ ప్రకటనలో ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాలలోను, ఆంధ్రప్రదేశ్‌లోను హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులపై జరుగుతున్న అత్యాచారాలపై తీవ్ర నిరసనను వ్యక్తంచేశారు.

సాంఘిక అన్యాయాలకు సంబంధించిన కేసులపై సమగ్ర దర్యాప్తు జరిపి తగిన చర్యలు గైకొనడానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని వారు సూచించారు. సవరించినఅస్పృశ్యతా నివారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు జరపాలని, హరిజన, గిరిజన వెనుకబడిన తరగతులపై అత్యాచారాలకు బాధ్యులైన అధికారులను పదవులనుంచి తొలగించాలని వారు కోరారు.

భూస్వాములు తదితర ఉన్నతవర్గాల అకృత్యాలకు బలైపోయిన హరిజన, గిరిజన వెనుకబడిన తరగతుల కుటుంబాలకు ప్రభుత్వం సహాయపడాలని, ఈ వర్గాలకు ప్రభుత్వం ఉచిత న్యాయం కల్పించాలని ఆ ప్రకటనలో కోరారు. ఈ వర్గాలకు చెందిన సంస్థలు, వాటి ప్రతినిధులు రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు.

జోనల్ రైల్వేల మేనేజర్లకు శ్రీ దండావతే ఉత్తర్వు

న్యూఢిల్లీ, ఆగస్టు 8— భారీ వర్షాల వల్ల, వరదలవల్ల ఏర్పడిన వివక్కర పరిస్థితిని ఎదుర్కోవడానికి భారీఎత్తున సహాయక చర్యలు చేపట్టవలసిందిగా రైల్వే మంత్రి శ్రీ మధు దండావతే అన్ని జోనల్ రైల్వేల మేనేజర్‌లకు ఆదేశాలు పంపారు.

దేశం వివిధ ప్రాంతాలలో వరదల వల్ల దెబ్బతిన్న రైల్వే కమ్యూనికేషన్‌లను సాధ్యమయినంత త్వరగా పునరుద్ధరించవలసిందిగా ఆయన రైల్వే అధికారులను కోరారు.

పునరుద్ధరణ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తుండవలసిందిగా ఆయన జనరల్ మేనేజర్లను ఆదేశించారు. అవసరమయిన చోట ట్రాఫిక్‌ను మళ్ళించడం, తాత్కాలిక బ్రిడ్జీలు నిర్మించడం వంటి చర్యలు గైకొనాలని ఆయన చెప్పారు.

ఢిల్లీ, హర్యానాలోని రేవారి మధ్య వరదలవల్ల రైల్వేలకు కలిగిన నష్టాన్ని అంచనా వేయడానికై శ్రీ దండావతే నిన్న వరదలకు గురయిన ప్రాంతాలను విమానంలోనుంచి పరిశీలించారు

దెబ్బతిన్న రైల్వేలైన్లను పునరుద్ధరించడానికి అన్నిరకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆయన విలేకరులకు చెప్పారు. ఆయనవెంట రైల్వేబోర్డు చైర్మన్ శ్రీ జి. పి. వారియర్ కూడా వున్నారు.

మద్రాసునగరంలోని రాయపురం కాలనీలో శనివారం జరిగిన ఒక అగ్నిప్రమాదంలో నూరు పాకలు మూడు మరపడవలు దగ్ధమైనాయి.

రాష్ట్రంలో మరి 35 హైదరాబాద్ స్టేట్ బ్యాంకి బ్రాంచీలు: త్వరలో ప్రారంభం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8—ఈ సంవత్సరం 35 శాఖలను ప్రారంభించడానికి స్టేట్ బ్యాంకి ఆఫ్ హైదరాబాదు నిర్ణయించినట్టు బ్యాంకి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దత్తా నిన్న ఇక్కడ తెలియచేశారు. ఈ సంవత్సరంలో ఇప్పటికే ఈ బ్యాంకి 14 శాఖలను ప్రారంభించింది.

నిన్న ఇక్కడ జరిగిన ఒక పత్రికా విలేకరుల సమావేశంలో శ్రీ దత్తా ప్రసంగిస్తూ గత సంవత్సరం ఈ బ్యాంకి 30 శాఖలను ప్రారంభించినట్టు చెప్పారు.

ఈ ఏడాది మొదట ఆరు నెలలలో 16.53 శాతం మేరకు డిపాజిట్లు పెరిగాయని ఆయన అన్నారు. ఈ బ్యాంకి ప్రధానంగా పనిచేస్తున్న మూడు రాష్ట్రాలకంటె, ఈ రాష్ట్రంలో 27 శాతంవరకు డిపాజిట్ల సంఖ్య పెరిగాయని, కర్ణాటకలో 13 శాతం మహారాష్ట్రలో 35 శాతం పెరిగినట్టు ఆయన వెల్లడించారు.

ఈ సంవత్సరం జూన్ ఆఖరునాటికి ఈ బ్యాంకి ఇచ్చిన అప్పులలో 31.19 శాతం ప్రాధాన్యరంగానికి, 36.81 శాతం ఆహారేతర సహకార రంగానికు ఇచ్చినట్టు శ్రీ దత్తా తెలిపారు.

గ్రామీణ, అర్బన్ బ్రాంచీలపంటి శాఖలలో 1979 మార్చినాటికి సహకార పరపతి ఋణాల నిష్పత్తిని 60 శాతం వరకు పెంచడానికి బ్యాంకి కృషి చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

గ్రామీణ అర్బన్ ప్రాంతాలలో ఈ బ్యాంకి బ్రాంచీలు 74.29 శాతంవరకు నెల కొల్పబడి రైతులు అవసరాలను విస్తృతంగా నెరవేర్చుతున్నదని ఆయనచెప్పారు.

ఈ ఏడాది జూన్ ఆఖరునాటికి వ్యవసాయ రంగంలో 25.39 కోట్ల మేరకు ఋణాలను 1,28,000 మందికి ఇచ్చినట్టు. ఋణాలను పొందినవారిలో 80 శాతం చిన్నతరహా రైతులు, భూమిలేని కార్మికులు వున్నట్టు ఆయన చెప్పారు. ఈసంవత్సరాంతంలో మరి తొమ్మిదికోట్ల రూపాయలను ఋణాలుగా ఇవ్వడానికి నిశ్చయించినట్టు తెలిపారు.

లఘుపరిశ్రమలకు ఈ ఏడాది జూన్ ఆఖరునాటికి 12.25 కోట్ల రూపాయలు ఋణాలుగా ఇచ్చినట్టు. మరొక 3.04 కోట్ల రూపాయలు మంజూరు చేయనున్నట్టుకూడా శ్రీ దత్తా చెప్పారు.

ఎగుమతి రంగంలో ఈ బ్యాంకి 20 కోట్ల రూపాయలను ఋణాలుగా ఇచ్చింది.

ప్రభుత్వ రంగంలో నిత్యావసర వస్తువుల ఉత్పత్తి: శ్రీ చంద్రశేఖర్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 8— అవసరమైన చోట్ల ప్రభుత్వరంగంలో నిత్యావసర వస్తువులను ఉత్పత్తి చేయాలని, ధరల పెరుగుదలను అరికట్టడానికి నిత్యావసర వస్తువుల పంపిణీ బాధ్యతలను ప్రభుత్వం స్వీకరించాలని జనతా పార్టీ అధ్యక్షుడు శ్రీ చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ సంస్థల అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసిన "దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత సమర్థవంతంగా తోడ్పడడానికి ప్రభుత్వ సంస్థలు తీసుకోవలసిన చర్యలు" అన్న గోష్ఠికి నిన్న ఇక్కడ ప్రారంభోత్సవం చేస్తూ, ప్రభుత్వ రంగం ఉత్పత్తి చేయవలసిన నిత్యావసర వస్తువులు ఏవో, నిత్యావసర వస్తువుల పంపిణీని ప్రభుత్వం ఏ మేరకు స్వాధీనం చేసుకోవాలో నిర్ణయించవలసిన సమయం ఆసన్నమయిందని ఆయన పేర్కొన్నారు.

ఇది కనుక చేయకపోతే, కార్మిక అశాంతి తీవ్రతను అరికట్టడం క్లిష్టమవుతుందని, అంతిమంగా దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు.

ప్రయివేటు రంగం కేవలం లాభార్జన దృష్టితోనే వున్నందున ప్రవ్యోల్బణాన్ని, ధరల పెరుగుదలను అరికట్టడం సాధ్యం కాలేదని అందువల్ల ప్రభుత్వం ఈ చర్యలను తీసుకోవలసివుందని శ్రీ చంద్రశేఖర్ వివరించారు. ప్రభుత్వ రంగం విషయంపై సాంఘిక, రాజకీయ వ్యవస్థల విజయం ఆధారపడి వుంటుందని ఆయన అన్నారు.

ప్రయివేటు, పబ్లిక్‌రంగాల మధ్య వివాదం గురించి ప్రస్తావిస్తూ, దేశాభివృద్ధికి ఉభయ రంగాల సహకారం ఎంతో అవసరమని అన్నారు. కాగా వారికి కేటాయించిన పరిధులలోనే ఈ రెండు కృషి చేయాలని ఆయన సూచించారు.

ధరల పెరుగుదలను అరికట్టడానికి వీలుగా ఉత్పత్తిని పెంపొందించడంలో సహకరించవలసిందని శ్రీ చంద్రశేఖర్ రాజకీయ పార్టీలను, కార్మికులను విజ్ఞప్తి చేశారు. సమ్మె చేయడం వంటి కార్మికుల న్యాయ సమ్మతమైన హక్కులకు తాను వ్యతిరేకిని కానని పేర్కొంటూ, తమ కోర్కెల విషయంలో పట్టుదలతో, ఉత్పత్తి హెచ్చింపుపై తమ దృష్టిని కేంద్రీకరించవలసిన సమయం ఆసన్నమయిందని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదేవిధంగా రాజకీయ విభేదాలను విస్మరించి, దేశ ఆర్థిక వ్యవస్థ పెంపుకు సమైక్యంగా కృషి చేయవలసిందని ఆయన రాజకీయ పార్టీలను కోరారు.

భారతీయ రోడ్ల నిర్మాణ సంస్థ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 8 — ప్రభుత్వ రంగంలో భారతీయ రోడ్ల నిర్మాణ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. నౌకా, రవాణా మంత్రిత్వ శాఖ క్రింద ఈ సంస్థ పనిచేస్తుంది.

ఈ సంస్థ ప్రధానంగా విదేశాలలో రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణం పనులను చేపడుతుంది. దేశంలోని ఇతర నిర్మాణ సంస్థల సహకారంలో సివిల్ ఇంజనీరింగ్ పనులను కూడా ఈ సంస్థ చేపడుతుంది.

క్లియర్ టచ్

ఫిలిం సిమెంట్‌కు

ఆంధ్రప్రదేశ్ అంతటా డీలర్లుకావలెను

వివరములకు:-

సోల్ డిస్ట్రిబ్యూటర్స్

జనతా ఏజెన్సీస్

గాంధీనగరం — విజయవాడ-520003

ఎల్లోరా పైలెట్

2 బ్యాండ్ల ట్రాన్సిస్టరు

రు. 129/- మాత్రమే

గ్యారంటీగల నాణ్యమైన తయారీ.

ఆడది నమ్మి చెడుతుంది! నమ్మకం చెడుతుంది!

ఆగష్టు 13 విడుదల!

చేగొండి హరిబాబు సమర్పించు గోకృష్ణ ఇంటర్నేషనల్ చిత్రం

చిలకమ్మ చెప్పింది

నిర్మాత: చలపాలగోట



కథ-కథనం-దర్శకత్వం: తూరంకి శర్మ

పాటలు: కె. బాలచందర్

లక్ష్మీఫిలింస్

ఆగష్టు 12 విడుదల!

సేవకుడు

ధర్మేంద్ర

చరణ-నిర్మాత: అర్జున్ భాంగోరా

సంగీతం: కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ

వాసిరెడ్డి నారాయణరావు

ఐదెకరాల న్యాయం

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆనందపరుస్తున్న వర్ణ చిత్రం!

పెద్దవాళ్ళ పగదేవుళ్ళకు బలి అయిన ప్రేయసీప్రియుల విచిత్ర గాథ!

చూడండి!

శ్రీవెంకటరమణా పిక్చర్స్

జన్మజన్మల బంధం



బ్యానర్లే-దర్శకత్వం: విశ్వచంద్రశేఖరరెడ్డి B.A

శ్రీ ఫిలింస్

VEEKAY